అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

సంపుటి - 3 సంచిక -149 గురువారం19 నవంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -8 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



జగన్ కేసుల్లో ఈడీ దూకుడుకు కారణమిదేనా?

WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103

ఎస్సీ, ఎస్టీలకు పెద్దపీట

విద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సముచిత స్థానం

ఎస్సీ వర్గీకరణను అమలు చేసి చూపించాం

రాజకీయంగా అత్యధిక అవకాశాలు కల్పించాం : సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్:నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):
ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఆయా వర్గాలకు సముచిత అవకాశాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. బుధవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై పార్లమెంటరీ కమిటీ చైర్మన్ డాక్టర్ ఫగ్గన్ సింగ్ కులస్తే, ఇతర సభ్యులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు, ఆయా వర్గాలకు కల్పిస్తున్న అవకాశాలను వివరించారు. .మిగతా 2లో...

కోటి కుటుంబాలకు రూ. 5 లక్షల ఇందిరమ్మ జీవిత బీమా పథకం

- తెలంగాణలో 'ఇందిరమ్మ కుటుంబ బీమా'.. సీఎం రేవంత్ కీలక ఆదేశాలు
- ప్రస్తుత ప్రభుత్వ బీమా పథకాలన్నీ ఒకే గొడుగు కిందకు
- సిద్దిపేటలో పథకాన్ని ప్రారంభించనున్న సీఎం
- అర్హులైన మహిళలందరికీ ఇందిరమ్మ చీరల పంపిణీకి ఆదేశం
- ప్రస్తుత లబ్ధిదారులకు నష్టం జరగకుండా చూడాలని స్పష్టత





భారత నేవీ రక్షణ వ్యవస్థలు మరింత బలోపేతం..

రక్షణ మంత్రిత్వ శాఖ, ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ మధ్య కీలక ఒప్పందం

రూ.1,976.40 కోట్లతో బరాక్ మిస్సైల్ వ్యవస్థల ఆధునికీకరణ

సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ అప్‌గ్రేడ్‌తో పెరగనున్న నేవీ రక్షణ పరిధి

ఢిల్లీ నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):
భారత నౌకాదళ యుద్ధనౌకల్లోని రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణ మంత్రిత్వ శాఖ కీలక అడుగు వేసింది. నౌకల్లో ఉండే 'బరాక్ పాయింట్ డిఫెన్స్ మిస్సైల్ సిస్టమ్' సమగ్ర ఆధునికీకరణ, నిర్వహణ కోసం ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ సంస్థతో ప్రభుత్వం భారీ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టు మొత్తం విలువ రూ.1,976.40 కోట్లు అని రక్షణ శాఖ అధికారిక ప్రకటనలో వెల్లడించింది. రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సమక్షంలో ఈ ఒప్పందంపై మిగతా 2లో...

జగన్ ఆస్తుల కేసులో మరో చార్జిషీట్

వైఎస్ జగన్ ఆస్తుల కేసులో 10వ చార్జ్‌షీట్ దాఖలు చేసిన ఈడీ

హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టులో అభియోగపత్రం సమర్పణ

దాల్మియా సిమెంట్స్ వ్యవహారంలో మనీలాండరింగ్ ఆరోపణలపై దర్యాప్తు



హైదరాబాద్ అమరావతి నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):
వైసీపీ అధినేత జగన్ ఆస్తుల కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. దాల్మియా సిమెంట్స్ వ్యవహారానికి సంబంధించి హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కొత్తగా చార్జ్‌షీట్ దాఖలు చేసింది. మిగతా 2లో...

ఏపీ ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు!

'ఆటో డ్రైవర్ల సేవలో' పథకానికి రూ.231 కోట్లు విడుదల

మహిళల ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో డ్రైవర్లకు మద్దతు

పాత వాహనాలపై గ్రీన్ ట్యాక్స్‌ను కూడా తగ్గించిన సర్కార్



అమరావతినవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):
ఆంధ్రప్రదేశ్‌లోని ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. 2026-27 సంవత్సరానికి గాను 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం కింద ఆర్థిక సాయం అందించేందుకు నిధుల విడుదలకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు వెనుకబడిన తరగతులకు చెందిన లబ్ధిదారుల కోసం రూ.231.13 కోట్లను విడుదల చేస్తూ మిగతా 2లో...

తీవ్ర తుపానుగా అక్వాన్..

నవంబర్ 20 మధ్యాహ్నం తీరం దాటనున్న తీవ్ర తుపాను అక్వాన్

నరసాపురం పూరీ మధ్య తీరం దాటే అవకాశం ఉందన్న ఐఎండీ

ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు బలమైన గాలుల హెచ్చరిక

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని విపత్తుల నిర్వహణ సంస్థ ఆదేశం

రంగంలోకి 13 ఎన్డీఆర్ఎఫ్ 11 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు



అమరావతి నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):
బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' తుపాను తీవ్ర రూపం దాల్చింది. ఇది దిశ మార్చుకుని, తీవ్ర తుపానుగా మారి ఉత్తర ఆంధ్రప్రదేశ్, యానాం సహా దక్షిణ ఒడిశా తీరాల వైపు వేగంగా దూసుకొస్తోంది. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించిన తాజా వివరాల ప్రకారం.. ఈ తీవ్ర తుపాను నవంబర్ 20 మధ్యాహ్నానికి నరసాపురం పూరీ మధ్య తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులుమిగతా 2లో...

అక్రమంగా చుక్కనీరు తీసుకెళ్లనివ్వం



కృష్ణా జలాల్లో నష్టం బీఆర్ఎస్ హయాంలోనే: ఉత్తమ్

'నాగార్జునసాగర్' కుడి వైపున 3 ఇన్‌టేక్ వెల్స్‌ను నిర్మిస్తున్న ఏపీ

తమకు కేటాయించిన 2.55 టీఎంసీల నీటిలోంచే ఇన్‌టేక్ వెల్స్ నిర్మిస్తున్నామన్న ఆంధ్రప్రదేశ్

0.57 టీఎంసీల నీటినే వాడుకుంటామని వెల్లడి

ఇంకో ఏడాదిన్నర తర్వాతే.. అదీ తాగునీటి కోసమే..

హైదరాబాద్ తాగునీటి అవసరాలకు తెలంగాణ కూడా సాగర్‌ను వాడుకుంటోందన్న ఏపీ ఇంజనీర్లు



నల్లగొండ/హైదరాబాద్, నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):
సాగర్ జలాల వినియోగంపై తెలంగాణ, ఏపీల మధ్య కాక మొదలైంది. విమర్శలకు, ప్రతివిమర్శలకూ దారితీస్తోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు జలాశయం కుడి వైపు(ఏపీ భూభాగం పరిధిలోకి వచ్చే రైట్ బ్యాంక్) నుంచి ఏపీలోని పల్నాడు, గుంటూరు జిల్లాల తాగునీటి అవసరాల కోసం జలజీవన్ పథకం కింద చేపట్టిన మిగతా 2లో...

ఏపీ జలదోపిడీ చేస్తుంటే ఏం చేస్తున్నారు

గత ఆంధ్ర పాలకుల కంటే రేవంత్ రెడ్డి వల్లే తెలంగాణకు ఎక్కువ నష్టం జరుగుతోంది: కేటీఆర్

కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయన్న కేటీఆర్

సాగర్ ప్రాజెక్టు నుంచి ఏపీ 90 టీఎంసీల నీటి మళ్లింపునకు యత్నిస్తోందని ఆరోపణ

జల్ జీవన్ మిషన్ పేరుతో నీటి వినియోగానికి కేంద్రం సహకరిస్తోందని విమర్శ

2లో.



ట్రంప్, జిన్‌పింగ్, పుతిన్.. ఒకే ఫ్రేమ్‌లో..

షెంజెన్‌లో జరుగుతున్న ఏపీఈసీ సమావేశాల సందర్భంగా అరుదైన దృశ్యం

అంతర్జాతీయ ప్రజాల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

ఎస్సీ, ఎస్టీలకు పెద్దపీట

మొదటిపేజీ తరువాయి

శాసనసభ స్పీకర్ పదవితో పాటు మంత్రివర్గంలోనూ దళితులకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించామని సీఎం పేర్కొన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు వివిధ కార్పొరేషన్లలోనూ ఎస్సీ, ఎస్టీలకు అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం వందేళ్ల చరిత్రలో తొలిసారిగా దళితుడికి వైస్ ఛాన్సలర్‌గా అవకాశం కల్పించామని వివరించారు.

ఉస్మానియా యూనివర్సిటీతో పాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, రాజీవ్ గాంధీ ఐఐఐటీల్లోనూ ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారికి వీసీలుగా అవకాశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. అర్హత, అవకాశం ఉన్న ప్రతి రంగంలోనూ ఆయా వర్గాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్), ఆరోగ్యశ్రీ పథకాల నిధుల్లో 50 శాతానికి పైగా ఎస్సీ, ఎస్టీల కోసం ఖర్చు చేస్తున్నట్లు కమిటీకి వెల్లడించారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా ఎస్సీ వర్గీకరణను అమలు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు వంటి అంశాలపై పార్లమెంటరీ కమిటీ సభ్యులు ముఖ్యమంత్రిని అభినందించారు.ఈ సమావేశంలో ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీగణేశ్, కమిటీ సభ్యులు తాహీర్ గావ్, హరీశ్చంద్ర మీనా, అనిల్ ఫిరోజియా, అరుణ్ కుమార్, ప్రసాదరావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భారతదేశ సమగ్రత, సమైక్యత, ఐక్యత కోసం జీవితాంతం కృషి చేసిన గొప్ప నాయకురాలు, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. పేదల సంక్షేమం కోసం ఆమె చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేసిన ధైర్యశాలి అని స్మరించుకున్నారు.బ్యాంకుల జాతీయీకరణ, రాజభరణాల రద్దు, 20 సూత్రాల కార్యక్రమం వంటి నిర్ణయాలతో దేశ ఆర్థిక, సామాజిక రంగాల్లో ఇందిరాగాంధీ కీలక మార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఆమె ఆశయాలు, సంక్షేమ విధానాల స్ఫూర్తితోనే తెలంగాణలో ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తోందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

కోటి కుటుంబాలకు రూ. 5 లక్షల ఇందిరమ్మ జీవిత బీమా పథకం

తెలంగాణలో 'ఇందిరమ్మ కుటుంబ బీమా'.. సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

ప్రస్తుత ప్రభుత్వ బీమా పథకాలన్నీ ఒకే గొడుగు కిందకు

సిద్దిపేటలో పథకాన్ని ప్రారంభించనున్న సీఎం

అర్హులైన మహిళలందరికీ ఇందిరమ్మ చీరల పంపిణీకి ఆదేశం

ప్రస్తుత లబ్ధిదారులకు నష్టం జరగకుండా చూడాలని స్పష్టత

హైదరాబాద్: నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):

తెలంగాణలోని కోటి పేద కుటుంబాలకు రూ. 5 లక్షల జీవిత బీమా కల్పించేలా 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని' విస్తరించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలు అమలు చేస్తున్న అన్ని బీమా పథకాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి, ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు.

మంగళవారం తన నివాసంలో 'ఇందిరమ్మ బీమా', 'ఇందిరమ్మ చీరల పంపిణీ'పై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం వివిధ శాఖల ద్వారా రూ. 2 లక్షల వరకు జీవిత బీమా, రూ. 10 లక్షల వరకు ప్రమాద బీమా సౌకర్యం అందుబాటులో ఉందని అధికారులు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. ఈ పథకాలన్నింటినీ ఇందిరమ్మ బీమా పరిధిలోకి తీసుకువచ్చి, జీవిత బీమా మొత్తాన్ని రూ. 5 లక్షలకు పెంచాలని ముఖ్యమంత్రి సూచించారు. అయితే, ప్రమాద బీమా ప్రయోజనాలు యథాతథంగా కొనసాగుతాయని, ప్రస్తుత లబ్ధిదారులెవరూ నష్టపోకుండా చూడాలని ఆయన స్పష్టం చేశారు.

మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 19న సిద్దిపేటలో నిర్వహించనున్న బహిరంగ సభలో ముఖ్యమంత్రి ఈ పథకం దరఖాస్తుల ప్రక్రియను అధికారికంగా ప్రారంభించనున్నారు. దరఖాస్తులను గ్రామస్థాయిలో అందుబాటులో ఉంచాలని, ఈ పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

ఇదే సమావేశంలో, అర్హులైన మహిళలందరికీ ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయాలని సీఎం ఆదేశించారు. చీరలను తక్షణమే అన్ని జిల్లాలకు తరలించాలని, పంపిణీ ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏపీ జలదోపిడీ చేస్తుంటే ఏం చేస్తున్నారు

హైదరాబాద్: నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):

తెలంగాణ సాగునీటి, తాగునీటి ప్రయోజనాలను దెబ్బతీసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ... నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి దాదాపు 90 టీఎంసీల కృష్ణా నది నీటిని మళ్లించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఈ ప్రక్రియకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరోక్ష సహకారం ఉంటోందని కేటీఆర్ పేర్కొన్నారు.

ప్రధానమంత్రి మోదీ, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీరు వల్ల తెలంగాణ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతోందని ఆయన విమర్శించారు. జల్ జీవన్ మిషన్ పేరుతో ఏపీ చేపడుతున్న నీటి వినియోగానికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇస్తోందని మండిపడ్డారు. గతంలో ఆంధ్ర పాలకుల కంటే రేవంత్ రెడ్డి పాలనలోనే రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరుగుతోందని అన్నారు.సాగర్ ప్రాజెక్టు వద్ద గత ఏడాది కాలంగా జరుగుతున్న పనులపై తెలంగాణ ప్రభుత్వానికి సమాచారం లేదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఏపీ నీటి మళ్లింపు యత్నాలను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకుందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు (కేఆర్ఎంబీ) అధికారికంగా ఏమైనా ఫిర్యాదు చేశారా? అని నిలదీశారు. అలాగే రాష్ట్ర తాగునీటి అవసరాల నిమిత్తం మిగిలిన 40 టీఎంసీల కేటాయింపులను కోరుతూ ప్రభుత్వం వెంటనే కేఆర్ఎంబీకి లేఖ రాయాలని అన్నారు.



అక్రమంగా చుక్కనీరు తీసుకెళ్లనివ్వం

మొదటిపేజీ తరువాయి

'పల్నాడు వాటర్ గ్రిడ్' ప్రాజెక్టు మొత్తం వివాదానికి కేంద్రంగా మారింది. రూ.1200 కోట్ల వ్యయంతో ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీన దీనిని కేంద్రప్రభుత్వ జల్‌జీవన్ మిషన్ పథకం కింద ఏపీ సర్కారు దీన్ని ప్రారంభించింది. ప్రస్తుతం సాగర్ రైట్ బ్యాంక్ వద్ద 160 ఎంఎల్డీ(మిలియన్ లీటర్స్ పర్ డే) సామర్థ్యంతో మూడు ఇంటెక్‌వెల్‌ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

200 వాటర్ ట్యాంకులు కట్టి... వాటిని సాగర్ జలాలతో నింపి పల్నాడు, గుంటూరు జిల్లాల గ్రామాలకు తాగునీరు పంపిణీ చేయాలన్నది ఏపీ లక్ష్యం. 1.86 టీఎంసీల జలాలను తరలించడానికి వీలుగా ఈ పనులు జరుగుతున్నాయి. విషయం తెలిసి రాష్ట్ర సాగు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన ఆదేశం మేరకు.. ఏపీ చేపట్టిన ప్రాజెక్టు పనులను నిలిపివేయాలని కోరుతూ కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి రాష్ట్ర నీటి పారుదలశాఖ కార్యదర్శి లేఖ రాశారు. ఇదే విషయంపై కృష్ణా బోర్డుకు తెలంగాణ ఈఎన్‌సీ లేఖ రాశారు. కృష్ణాబోర్డు చైర్మన్‌తోనూ మంత్రి ఉత్తమ్ ఫోన్‌లో చర్చలు జరిపి... పనులు నిలిపివేయాలని కోరారు. మరోవైపు సాగర్ ఎస్‌ఈతో పాటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ)కి నీటిపారుదలశాఖ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఏపీ ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వానికి సమాచారం ఇవ్వకపోవటంపై చర్యలు ఎందుకు తీసుకోరాదో వారం రోజుల్లోపు వివరణ ఇవ్వాలని ఆ నోటీసుల్లో పేర్కొంది.

తమ రాష్ట్రంలో చెరువులు నింపేందుకు తమకు గతంలో కేటాయించిన 2.55 టీఎంసీల నీటిలోంచే 0.57 టీఎంసీల నీటిని వాడుకుంటూ ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు ఏపీ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఇంటెక్‌వెల్ పనులు మాత్రమే జరుగుతున్నాయని, పనులు పూర్తి కావటానికి మరో ఏడాదిన్నర పడుతుందని, ఆ తర్వాతే గ్రామాలకు తాగునీరిస్తామని





పేర్కొంటున్నారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం తెలంగాణలోనూ నాగార్జునసాగర్ ప్రాజెక్టు జలాలను వాడుకుంటున్నారని, దీనికి అదనంగా సుంకిశాలను కూడా నిర్మాణం చేస్తున్నారని గుర్తు చేస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మిషన్ భగీరథ కోసం సాగర్ ప్రాజెక్టు, టెయిల్ పాండ్ డ్యామ్‌ల నుంచే నీటిని తీసుకుంటున్నారని పేర్కొంటున్నారు. తాము 70 టీఎంసీల నీళ్లను తరలించుకుపోతున్నామనే ఆరోపణ సరికాదన్నది ఏపీ అధికారుల వాదన.

ఏ పోరాటానికైనా సిద్ధం: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాగర్ నుంచి 90 టీఎంసీలు కాదు కదా... ఒక్క చుక్క నీళ్లు కూడా ఏపీ అక్రమంగా తీసుకెళ్లకుండా అడ్డుకుంటామని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ప్రజలను దగా చేసే విధంగా ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్నాయని, కృష్ణా జలాల్లో నష్టం, మోసం బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని మండిపడ్డారు. బుధవారం సచివాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగర్ నుంచి తాగునీటి అవసరాల కోసం 1.8 టీఎంసీలు తరలించడానికి వీలుగా ఏపీ పనులు చేపట్టిందనే సమాచారం అందగానే ఈనెల 16న కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి, కృష్ణా నది యాజమాన్య బోర్డులకు లేఖ రాశామని గుర్తు చేశారు.

కృష్ణాబోర్డు చైర్మన్‌కు స్వయంగా తానే ఫోన్ చేసి ఫిర్యాదు

చేశానని, దీనిపై ఏపీకి నోటీసులు పంపిస్తామని బోర్డు చైర్మన్ తెలిపారన్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ ప్రజానీకానికి, రైతాంగానికి ఉపయోగపడే విధంగా ఏ పోరాటానికైనా, త్యాగానికైనా సిద్ధమని చెప్పారు. 2004-2014 దాకా కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో శ్రీశైలం నుంచి ఏపీ తరలించిన నీటి సామర్థ్యం 4.41 టీఎంసీలు కాగా... పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో అది 13.17 టీఎంసీలకు చేరిందని మంత్రి తెలిపారు. సాగునీళ్ల విషయంలో బీఆర్ఎస్ తెలంగాణ రైతాంగానికి, ప్రజానీకానికి అబద్ధాలు చెబుతోందని ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా... రూ.1.83 లక్షల కోట్లను నీటిపారుదల ప్రాజెక్టులపై వెచ్చించినప్పటికీ ఒక్క ప్రాజెక్టు అయినా పూర్తి చేశారా అని ప్రశ్నించారు. 21 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే సాగర్‌ను, 14 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చే ఎస్సారెస్పీ, జూరాల, లోయర్ మానేరు, కడెం ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే నిర్మించామని గుర్తు చేశారు. సాగర్ కింద క్రాప్ హాలీడే ప్రకటించలేదని, వరి కాకుండా అరుతడి పంటలు సాగుచేసుకోవాలని రైతులను కోరామన్నారు

జగన్ ఆస్తుల కేసులో మరో చార్జిషీట్

మొదటిపేజీ తరువాయి

మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఈడీ సమర్పించిన పదో చార్జ్‌షీట్ ఇది. ఇందులో జగన్‌తో పాటు దాల్మియా సిమెంట్స్ ప్రతినిధి పునీత్ దాల్మియా తదితరులను నిందితులుగా పేర్కొంది. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కడప జిల్లాలో 417 హెక్టార్ల సున్నపురాయి గనుల లీజుల కేటాయింపునకు ప్రతిఫలంగా.. జగన్‌కు చెందిన రఘురాం సిమెంట్స్ (తర్వాతి కాలంలో భారతి సిమెంట్స్)లో దాల్మియా సంస్థ రూ.95 కోట్ల మేర పెట్టుబడులు పెట్టినట్లు సీబీఐ గతంలోనే కేసు నమోదు చేసింది. ఆ కేటాయింపుల ద్వారా జగన్ సుమారు రూ.150 కోట్ల మేర లబ్ధి పొందారని సీబీఐ ఆరోపించింది.అనంతరం రఘురాం సిమెంట్స్ వాటాలను ఫ్రెంచ్ కంపెనీ పార్కిసిమ్‌కు విక్రయించగా వచ్చిన మొత్తంలో రూ.55 కోట్లు హవాలా మార్గంలో జగన్‌కు చేరాయని దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. ఈ అంశాలపైనే ఈడీ మనీలాండరింగ్ కోణంలో లోతైన విచారణ జరిపింది. గతంలో కొన్ని సాంకేతిక కారణాలతో అభియోగపత్రాలు వెనక్కి రాగా, తాజాగా ఈడీ పూర్తి స్థాయి ఆధారాలతో న్యాయస్థానంలో చార్జ్‌షీట్ సమర్పించింది. న్యాయస్థానం దీనిని పరిగణనలోకి తీసుకున్న తర్వాత నిందితులకు సమన్లు జారీ చేసే అవకాశముంది.

ఏపీ ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు!

మొదటిపేజీ తరువాయి

బీసీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలోనే అర్హులైన డ్రైవర్ల బ్యాంకు ఖాతాల్లోకి రూ.15 వేల చొప్పున జమ చేయనున్నారు.సొంతంగా ఆటో, మోటార్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ కలిగి ఉండి, దానిని నడుపుతూ జీవనం సాగించే యజమానులకు ఈ పథకం కింద ప్రభుత్వం ఏటా రూ.15,000 ఆర్థిక సాయం అందిస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో మహిళల కోసం 'స్త్రీ శక్తి' పేరుతో ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రారంభించడంతో తమ ఆదాయం తగ్గిందని ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. మేనిఫెస్టోలో హామీ ఇవ్వకపోయినా డ్రైవర్లకు మద్దతుగా నిలవాలనే ఉద్దేశంతో ఈ సాయం అందిస్తోంది.

ఈ పథకానికి అర్హత ఉండి జాబితాలో పేరు లేనివారు ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను కూడా ఏర్పాటు చేసింది. లబ్ధిదారులు తప్పనిసరిగా ఏపీలో జారీ చేసిన డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలి. ఇదే సమయంలో పాత వాహనాలపై గతంలో ఉన్న గ్రీన్ ట్యాక్స్‌ను రూ.20 వేల నుంచి రూ.3 వేలకు తగ్గిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కూడా వాహనదారులకు ఉపశమనం కలిగిస్తోంది

భారత నేవీ రక్షణ వ్యవస్థలు మరింత బలోపేతం..

మొదటిపేజీ తరువాయి

సంతకాలు జరిగాయి.ఈ ఒప్పందం ద్వారా భారత యుద్ధనౌకల్లోని బరాక్ క్షిపణి వ్యవస్థకు సంబంధించి హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ రెండింటినీ సమగ్రంగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. పాతబడిపోయిన విడిభాగాల స్థానంలో అత్యాధునిక వ్యవస్థలను తీసుకురానున్నారు. దీనివల్ల నౌకాదళానికి శత్రు దేశాల విమానాలు, క్షిపణి దాడులను సమర్థంగా అడ్డుకునే గగనతల రక్షణ (ూాత్అ-ూాఅతీ ణవటవఅఎవ) సామర్థ్యం గణనీయంగా పెరుగుతుంది. భారత సైనిక సేకరణ నిబంధనలలోని 'ఇతర మూలధన సేకరణ' విధానం కింద ఈ ఒప్పందాన్ని ఖరారు చేశారు.ప్రస్తుత నవంబర్ నెలలోనే భారత నౌకాదళానికి సంబంధించి ఇది మూడో కీలక ఒప్పందం కావడం విశేషం. కొద్ది రోజుల క్రితం, నవంబర్ 11న కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌తో రక్షణ శాఖ రూ.498.58 కోట్ల విలువైన ఒప్పందం చేసుకుంది. బ్రహ్మపుత్ర క్లాస్ యుద్ధనౌక అయిన 'ఐఎన్ఎస్ బెత్వా' మరమ్మతులు, ఇంజిన్ ఆధునికీకరణ కోసం దీనిని కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా నౌకలోని పాత స్టీమ్ ప్రొపల్షన్ స్థానంలో సరికొత్త డీజిల్ ఇంజిన్ ప్రొపల్షన్ వ్యవస్థను అమర్చనున్నారు. అంతేకాకుండా, అత్యాధునిక ఆయుధ సంపత్తిని జోడించడం ద్వారా ఐఎన్ఎస్ బెత్వా కార్యాచరణ సామర్థ్యాన్ని మరింత పెంచనున్నారు.అంతకుముందు నవంబర్ 2న రక్షణ శాఖ దేశీయ షిప్‌యార్డులతో ఏకంగా రూ.53,866.50 కోట్ల విలువైన భారీ ప్రాజెక్టును ఖరారు చేసింది. భారత నౌకాదళం కోసం స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించే 8 నెక్స్ట్ జనరేషన్ కార్వెట్‌ల నిర్మాణం కోసం రెండు ప్రభుత్వ రంగ సంస్థలకు బాధ్యతలు అప్పగించారు. కోల్‌కతాకు చెందిన గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ ఐదు కార్వెట్‌లను, గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ మూడు కార్వెట్‌లను నిర్మించనున్నాయి.

ఈ భారీ ప్రాజెక్టు ద్వారా రాబోయే 10 ఏళ్ల కాలంలో షిప్‌యార్డుల్లో దాదాపు 72 లక్షల పనిదినాలు, అనుబంధ పరిశ్రమలు మరియు ఎంఎస్ఎంఈలలో సుమారు 460 లక్షల పనిదినాల ఉపాధి లభించనుంది. భారత నౌకాదళమే స్వయంగా డిజైన్ చేసి, పోటీ బిడ్డింగ్ ద్వారా ప్రభుత్వ రంగ సంస్థలతో నిర్మిస్తున్న తొలి ప్రాజెక్టు ఇదే కావడం విశేషం. దేశీయంగా నౌకా నిర్మాణం, సాంకేతిక స్వావలంబన సాధించే లక్ష్యంతో ప్రభుత్వం రక్షణ రంగాన్ని వేగంగా ఆధునీకరిస్తోంది.

తీవ్ర తుపానుగా అక్వాన్..

మొదటిపేజీ తరువాయి

వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

పశ్చిమ మధ్య, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన 'అక్వాన్' తీవ్ర తుపాను గత ఆరు గంటల్లో గంటకు 9 కిలోమీటర్ల వేగంతో ఉత్తర-వాయవ్య దిశగా కదిలింది. ప్రస్తుతం ఇది నరసాపురానికి ఆగ్నేయంగా 500 కిలోమీటర్లు, కళింగపట్నానికి దక్షిణ-ఆగ్నేయంగా 540 కిలోమీటర్లు, చెన్నైకి తూర్పుగా 560 కిలోమీటర్లు, గోపాల్‌పూర్‌కు దక్షిణంగా 630 కిలోమీటర్లు, పూరీకి దక్షిణంగా 690 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది మరింతగా ఉత్తర-వాయవ్య దిశలోనే ప్రయాణించి తీరం వైపు సాగుతుందని అధికారులు స్పష్టం చేశారు.

ఈ తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో గురువారం విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) మేనేజింగ్ డైరెక్టర్, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయని చెప్పారు. విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని వివరించారు. గురువారం ఉత్తరాంధ్ర తీరం వెంబడి గంటకు 60 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 80 కిలోమీటర్ల వరకు ఈదురుగాలులు వీస్తాయని పేర్కొన్నారు. సముద్రం అల్లకల్లోలంగా మారనున్నందున మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. తీరప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మరోవైపు తుపాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలపై దృష్టి సారించింది. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. రాబోయే 48 గంటల పాటు అధికార యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

తుపాను సహాయక చర్యల కోసం ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వీలుగా 13 ఎన్డీఆర్ఎఫ్ (టీమ=ళీ), 11 ఎస్డీఆర్ఎఫ్ (రాణ=ళీ) బృందాలతో పాటు స్థానిక అగ్నిమాపక దళాలను సిద్ధంగా ఉంచినట్లు హోం మంత్రి తెలిపారు. అవసరమైన ప్రాంతాలకు తక్షణమే ఈ బృందాలను తరలించేలా కార్యాచరణ రూపొందించామన్నారు. జిల్లా, మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లు 24 గంటల పాటు నిరంతరం పనిచేయాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, విజ్ఞప్తులపై వెంటనే స్పందించి సహాయం అందించాలని ఆమె అధికారులను ఆదేశించారు.

ట్రంప్, జిన్‌పింగ్, పుతిన్.. ఒకే ఫ్రేమ్‌లో..

షెంజెన్‌లో జరుగుతున్న ఏపీఈసీ సమావేశాల సందర్భంగా అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కలిసి ఫొటోకు పోజులిచ్చారు. సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన వారు అక్కడ పరస్పరం కరచాలనం చేసుకున్నారు. అప్పటికే రెడ్ కార్పెట్‌పై నిలబడ్డ ట్రంప్, షీలను సమీపించిన పుతిన్ వారితో ముచ్చటించిన అనంతరం ఫొటోకు పోజులిచ్చారు. 2025 ఆగస్టులో అలాస్కాలో చర్చల సందర్భంగా ట్రంప్, పుతిన్‌లు కలిశారు.

ట్రంప్ వచ్చేందుకు కొన్ని గంటల ముందే పుతిన్ షెంజెన్‌కు వచ్చారు. అక్కడ చైనా అధినేత షీ జిన్‌పింగ్‌తో చర్చలు జరిపారు. ఆ తరువాత వచ్చిన ట్రంప్‌నకు షీ స్వయంగా ఆహ్వానం పలికారు. ట్రంప్‌తో పుతిన్, షీ జిన్‌పింగ్‌లు కలుపుగోలుగా కనిపించినప్పటికీ అమెరికా తీరును మాత్రం వారు విమర్శించారు. అమెరికా విధిస్తున్న ఆర్థిక ఆంక్షలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇక గురువారం ట్రంప్, పుతిన్, షీజిన్‌పింగ్ మధ్య కీలక సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో వారు అణునిరాయుధీకరణ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇరాన్, ఉక్రెయిన్ యుద్ధంపై చర్చించనున్నారు. ఇక ఎన్విడియా సీఈఓ ఉదంతం నేపథ్యంలో తమ ఏఐ సాంకేతికత చైనాకు అందకుండా అమెరికా మరిన్ని చర్యలకు ఉపక్రమించిన విషయం తెలిసిందే.

2,200 మందికి నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాలు

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

లబ్ధిదారులకు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి





మిర్యాలగూడ/నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):
మిర్యాలగూడ పట్టణంలోని మినీ రవీంద్రభారతిలో నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ, దామరచర్ల, అడవిదేవులపల్లి మండలాలకు చెందిన 2,200 మంది లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర అర్హులకు చేయూత పింఛన్లు ఆర్థిక భరోసా కల్పిస్తూ వారి జీవనానికి అండగా నిలుస్తాయని పేర్కొన్నారు. పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి కడియం శ్రీహరి





ధర్మసాగర్ / నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):
ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామంలో శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరికి గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. పూజల అనంతరం ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ నారాయణగిరి గ్రామంలో పెద్దమ్మ తల్లి వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలతో గ్రామ ప్రజలతో పాటు నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పుట్ట రేణుక, మండల ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతుల ధాన్యానికి భరోసా..

ధర్మసాగర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభం!

దళారుల దోపిడీకి తావులేకుండా మద్దతు ధరకు కొనుగోళ్లు

రైతులకు ఇబ్బందులు కలిగితే సహించేది లేదు.. పీఏసీఎస్ ఆధ్వర్యంలో పటిష్ట ఏర్పాట్లు





ధర్మసాగర్ / నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):
రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర దక్కాలి.. దళారుల దోపిడీకి అడ్డుకట్ట పడాలి.. రైతు చెమటకు తగిన ప్రతిఫలం అందాలి.. అనే లక్ష్యంతో ధర్మసాగర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ధర్మసాగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలీయా ప్రారంభించారు.
రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందేలా కొనుగోళ్లలో పారదర్శకత పాటించాలని నిర్వాహకులు చర్యలు చేపట్టారు. ధాన్యం తూకం నుంచి కొనుగోలు, రవాణా వరకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేశారు. సిబ్బంది, హమాలీలను అందుబాటులో ఉంచి కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.
ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు అన్యాయం జరగకుండా, కొనుగోళ్లలో అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరిస్తామని తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పీఏసీఎస్ పనిచేస్తుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొంతం కొమురమ్మ, పాలకవర్గ సభ్యులు మేకల సాంబరాజు, మాల్కిరెడ్డి మమత రణధీర్, ముజ్జు, చిలుక ప్రతిభ, జాలిగాపు కళ్యాణి శ్యామ్, బెల్లం ప్రేమ్ యాదవ్, పోలుమారి మౌనిక రణధీర్, పుట్ట లావణ్య ప్రదీప్, గ్రామ శాఖ అధ్యక్షుడు గంటె సాంబరాజు, ఏనుమాముల డైరెక్టర్ ఎం.డి. సబెరా బేగం, యాసిన్ మియా, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.
అలాగే పీఏసీఎస్ ధర్మసాగర్ డైరెక్టర్లు బొడ్డు లెనిన్, జంగా వీరయ్య, సొసైటీ కార్యదర్శి పింగిలి రాజిరెడ్డి, ధర్మసాగర్ పీపీసీ కేంద్రం ఇన్‌చార్జి బొడ్డు ప్రభుదేవ్ వంశీ, కార్యాలయ సిబ్బంది ఆవుల కుమారస్వామి, కలకోటి మురళీకృష్ణ, రైతులు, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.రైతుల కష్టానికి తగిన ధర, ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత, సకాలంలో సేవలు అందించడమే లక్ష్యంగా ధర్మసాగర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దళిత హక్కుల పోరాట సమితి 20వ వార్షికోత్సవాలను జయప్రదం చేయండి

నవంబర్ 29, 30 తేదీల్లో హైదరాబాద్‌లో మహాసభలు -రాజారపు రత్నం, హనుమకొండ జిల్లా అధ్యక్షుడి పిలుపు



ధర్మసాగర్ / నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):
దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నవంబర్ 29, 30 తేదీల్లో హైదరాబాద్‌లోని చిక్కడపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న 20వ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని ఆ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రాజారపు రత్నం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ధర్మసాగర్ మండల కేంద్రంలో వార్షికోత్సవ మహాసభల ప్రచార పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది సంవత్సరాలుగా దేశంలో కొనసాగిన సామాజిక, ఆర్థిక దోపిడీ విధానాల వల్ల దళితులు, అణగారిన వర్గాలు తీవ్ర వివక్షకు, అణచివేతకు గురయ్యారని పేర్కొన్నారు. వర్ణ వ్యవస్థ, మనువాద భావజాలం సమాజంలో అసమానతలకు, అంటరానితనానికి కారణమయ్యాయని విమర్శించారు. తరతరాలుగా అంటరానితనం, కులవివక్ష, దోపిడీ, పీడనలతో నలిగిపోతున్న అట్టడుగు వర్గాలు, శ్రామిక కులాల అభ్యున్నతే లక్ష్యంగా దళిత హక్కుల పోరాట సమితి ఆవిర్భవించిందని తెలిపారు.
దళితులపై కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ, అణచివేతలను ఎదిరించి సమానత్వం సాధించే దిశగా ప్రజలను సంఘటితం చేయడం, చైతన్యవంతులను చేయడం సమితి ప్రధాన లక్ష్యమని వివరించారు. దళితుల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం జరిగే ఈ మహాసభల్లో ప్రజలు, ప్రజాస్వామికవాదులు, శ్రామిక వర్గాలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.
ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా డీహెచ్‌పీఎస్ నిర్మాణ బాధ్యుడు మద్దెల ఎల్లేష్, కుడి స్వామి, వెంకటేష్, బొట్టు బిక్షపతి, బిక్షపతి, చిలుక బాబు, వెంకన్న, ధర్మన్న, రాజన్న, స్వామి, సునీల్, గట్టయ్య, అన్నమ్మ, భాగ్య, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

3వ వార్డులో ఆసరా పింఛన్ల కార్డుల పంపిణీ

అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

కాంగ్రెస్ నేతలు కొమ్ము రాజేశ్వరి, కొమ్ము నర్సింగరావు

జనగామ/చేర్యాల నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో భాగంగా చేర్యాల మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో బుధవారం ఆసరా పింఛన్ల కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 3వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ కొమ్ము రాజేశ్వరి, చేర్యాల మాజీ జెడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు ఆధ్వర్యంలో పలువురు లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందని అన్నారు. ప్రభుత్వ అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని విమర్శించారు. గత బీఆర్ఎస్ పాలనలో గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణలో విఫలమైన నాయకులు నేడు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను అవమానించేలా మాట్లాడటం తగదన్నారు. ఇకనైనా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఇదే తరహాలో అనుచిత వ్యాఖ్యలు కొనసాగిస్తే నియోజకవర్గంలో ప్రజల నుంచి ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేర్యాల మండలంతో పాటు జనగామ నియోజకవర్గంలో ఎన్ని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేశారో ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామం ఉండదని ధీమా వ్యక్తం చేశారు. ఈ అంశంపై బహిరంగ చర్చకు రావాలని బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

నూతన చేయూత పింఛన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ



హసన్‌పర్తి/నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పింఛన్ పథకంలో నూతనంగా ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఉదయం 10 గంటలకు హసన్‌పర్తి మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ తాళ్లపెల్లి కుమారస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో కొయ్యడ దీపిక, సందీప్, వార్డు సభ్యులు కొయ్యడ మౌనిక, తీగల నరేష్, జోరుక రాజేందర్, పంచాయతీ కార్యదర్శి హేమలత, కారోబార్ చాతల్ల సదానందం, మాజీ సర్పంచ్ జోరుక పూల, తాళ్లపెల్లి రమేష్, కొయ్యడ సునీల్, సౌరం సుధాకర్, చరణ్ తేజ, కొయ్యడ విజయ్ కుమార్, గణేష్ తదితరులు పాల్గొన్నారు. పలువురు చేయూత పింఛన్ లబ్ధిదారులు హాజరయ్యారు.

డాక్టర్ నమిండ్ల మౌనికకు ఘన సన్మానం

మైరా స్కిన్ అండ్ హెయిర్ క్లినిక్‌ను సందర్శించి అభినందించిన తెలంగాణ ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి





హసన్‌పర్తి/నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త): హసన్‌పర్తి మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన టీపీసీసీ ఉపాధ్యక్షులు నమిండ్ల శ్రీనివాస్ కుమార్తె డాక్టర్ నమిండ్ల మౌనిక నక్కలగుట్టలో నూతనంగా ఏర్పాటు చేసిన మైరా స్కిన్ అండ్ హెయిర్ క్లినిక్‌ను తెలంగాణ రాష్ట్ర ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ నమిండ్ల మౌనికను శాలువాతో ఘనంగా సత్కరించి, నూతనంగా ప్రారంభించిన క్లినిక్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. యువతులు స్వయం ఉపాధి రంగంలో ముందడుగు వేస్తూ, తమ ప్రతిభతో వ్యాపార రంగంలో రాణించడం ఎంతో స్ఫూర్తిదాయకమని జంగా రాఘవరెడ్డి పేర్కొన్నారు. మైరా సంస్థ మరింత అభివృద్ధి సాధించి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. డాక్టర్ నమిండ్ల మౌనికకు ప్రత్యేకంగా అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

78 మందికి కంటి పరీక్షలు.. 35 మందికి శస్త్రచికిత్సకు ఎంపిక



నరసన్నపేట/నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):
నిరుపేదలకు మెరుగైన కంటి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నరసన్నపేట మండల పరిధిలోని పెద్దపేట వీధిలో జగన్నాథ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న కల్వరి బాప్టిస్ట్ మినిస్ట్రీస్ చర్చ్ వద్ద బుధవారం ఈ శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శ్రీకాకుళం వారి సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి, విశాఖపట్నం మరియు కల్వరి బాప్టిస్ట్ మినిస్ట్రీస్, నరసన్నపేట వారి ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం జరిగింది. శిబిరంలో మొత్తం 78 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 35 మందిని కంటి శస్త్రచికిత్సలకు అర్హులుగా గుర్తించి మెరుగైన చికిత్స నిమిత్తం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. చిన్నపిల్లలకు సంబంధించిన కంటి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, ప్రముఖ వైద్య నిపుణులచే ప్రత్యేక చికిత్స అందించేందుకు అవసరమైన వారిని ఆసుపత్రికి సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో కల్వరి బాప్టిస్ట్ చర్చ్ చైర్మన్ రెవరెండ్ పి. జాన్ డేవిడ్, డైరెక్టర్ రెవరెండ్ పి. రత్నకుమారి, డైరెక్టర్ పి. రవికుమార్, శంకర్ ఫౌండేషన్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ అరుణ, శంకర్ ఫౌండేషన్ శిబిర సమన్వయకర్త సీహెచ్. అశ్వనీకుమార్, నర్సింగ్ సిబ్బంది తేజస్విని తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అణగారిన ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

ఖమ్మం కేబుల్ బ్రిడ్జికి వనజీవి దరిపల్లి రామయ్య పేరు పెట్టాలి

బ్రిడ్జి సమీపంలో కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలి

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు వీరవెల్లి రాజేష్ గుప్తా వినతి

ఖమ్మం/నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):



ఖమ్మం జిల్లా గర్వించదగిన వ్యక్తి, పర్యావరణ పరిరక్షణకు తన జీవితాన్ని అంకితం చేసిన పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి దరిపల్లి రామయ్య సేవలకు తగిన గుర్తింపు కల్పించాలని బీజేపీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు వీరవెల్లి రాజేష్ గుప్తా కోరారు.ఈ మేరకు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌కు వినతిపత్రం అందజేశారు. ఖమ్మం నగరంలో నూతనంగా నిర్మించిన కేబుల్ బ్రిడ్జికి "పద్మశ్రీ వనజీవి దరిపల్లి రామయ్య కేబుల్ బ్రిడ్జి"గా నామకరణం చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా బ్రిడ్జి సమీపంలో ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.దరిపల్లి రామయ్య తన జీవితమంతా పర్యావరణ పరిరక్షణకే అంకితం చేశారని, వేలాది మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తూ సమాజంలో పచ్చదనంపై చైతన్యం కల్పించారని రాజేష్ గుప్తా పేర్కొన్నారు. ఆయన విశిష్ట సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించిందని గుర్తుచేశారు.ఖమ్మం జిల్లా నుంచి ఎదిగి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన మహనీయుడి పేరును నగరంలోని ప్రముఖ కేబుల్ బ్రిడ్జికి పెట్టడం ద్వారా ఆయన సేవలను చిరస్మరణీయం చేయవచ్చని అన్నారు. విగ్రహం ఏర్పాటు భావితరాలకు పర్యావరణ పరిరక్షణపై స్ఫూర్తినిస్తుందని తెలిపారు.జిల్లా కలెక్టర్ ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని, తగిన చర్యలు తీసుకోవాలని వీరవెల్లి రాజేష్ గుప్తా కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఒకటో పట్టణ అధ్యక్షులు గడిల నరేష్ పాల్గొన్నారు.

అర్హులైన పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

పక్షపాతం లేకుండా సంక్షేమ పథకాల అమలు ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్





కేసముద్రం/నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):పక్షపాతం లేకుండా, పార్టీలకతీతంగా అర్హులైన పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్ అన్నారు. గత ప్రభుత్వానికి భిన్నంగా అర్హులైన పేదలను నిష్పక్షపాతంగా గుర్తించి, చేయూత పథకం ద్వారా పింఛన్లు మంజూరు చేస్తూ వారికి ఆర్థిక భరోసా కల్పిస్తోందని తెలిపారు.కేసముద్రం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో చేయూత పథకం ద్వారా నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల వరకే రాజకీయ పార్టీలని, ఆ తర్వాత ప్రజా అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అన్ని వర్గాలను కలుపుకొని ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నియంతృత్వ ధోరణులకు తావులేకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో పాలన సాగిస్తోందని పేర్కొన్నారు. కేసముద్రం పట్టణ అభివృద్ధి విషయంలో ఎలాంటి బేషజాలకు పోకుండా రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి సహకారంతో సుమారు రూ.500 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కేసముద్రం పట్టణాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పేదల ఆర్థిక అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు, ట్రాన్స్‌పోర్ట్ కమిటీ సభ్యుడు రావుల మురళి, పీఏసీఎస్ వైస్ చైర్మన్లు అంబటి మహేందర్ రెడ్డి, అల్లం నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఎంపీడీవో తోట హరీష్, కౌన్సిలర్లు, పలువురు సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లారీఆటో ఢీకొని మేస్త్రి మృతి

బావుపేట క్రాస్ వద్ద ఘోర ప్రమాదం.. చికిత్స పొందుతూ మృతి చెందిన విజేందర్

హసన్‌పర్తి/నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):



హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బావుపేట క్రాస్ వద్ద జాతీయ రహదారి 563పై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గ్రీన్ వ్యాలీ జూనియర్ కళాశాల బ్రిడ్జి సమీపంలో లారీ, ప్రయాణికుల ఆటో బలంగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు.
హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామానికి చెందిన మేకల విజేందర్ (46) మేస్త్రి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన సయ్యద్ అఫ్జల్‌తో కలిసి ప్రయాణికుల ఆటో (TS`03`UA`6041)లో ముచ్చర్ల గ్రామానికి వెళ్లాడు. అక్కడ తమ బంధువైన మట్టెడ కుమారస్వామి వద్ద సెంట్రింగ్ సామగ్రిని ఆటోలో లోడ్ చేసుకుని ముగ్గురూ సూరారం గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఆటోను కుమారస్వామి నడుపుతున్నాడు.ఈ క్రమంలో నవంబర్ 17న రాత్రి 7.30 గంటల సమయంలో బావుపేట క్రాస్ సమీపంలోని గ్రీన్ వ్యాలీ జూనియర్ కళాశాల బ్రిడ్జి వద్దకు చేరుకోగానే ప్రమాదం జరిగింది. ఆటో డ్రైవర్ రాంగ్ రూట్‌లో అజాగ్రత్తగా నడుపుతుండగా, ఎదురుగా వస్తున్న లారీ (GJ`12`CV`6526) డ్రైవర్ సచిన్ కుమార్ అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ ఆటోను బలంగా ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు.ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న విజేందర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ అత్యవసర చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో నవంబర్ 18 తెల్లవారుజామున 1.01 గంటలకు విజేందర్ మృతి చెందాడు.మృతుడి భార్య మేకల కోమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ మట్టెడ కుమారస్వామి, లారీ డ్రైవర్ సచిన్ కుమార్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్ వెల్లడించారు.

జాతీయస్థాయి డ్యాన్స్ పోటీల్లో జ్ఞానికా రెడ్డి ప్రతిభ

ఎనిమిదేళ్ల వయసులోనే కూచిపూడి నృత్యంతో ప్రత్యేక గుర్తింపు

చిన్నారి ప్రతిభను అభినందించిన తల్లాడ ప్రముఖులు

తల్లాడ/నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):



జాతీయస్థాయి డ్యాన్స్ పోటీల్లో తల్లాడకు చెందిన ఎనిమిదేళ్ల చిన్నారి దగ్గుల జ్ఞానికా రెడ్డి తన ప్రతిభను చాటుకుంది. హైదరాబాద్‌లోని భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో నవంబర్ 16 నుంచి 19 వరకు నిర్వహిస్తున్న జాతీయస్థాయి నృత్య పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకుంది. ఇందులో భాగంగా బుధవారం జరిగిన పోటీల్లో కూచిపూడి నృత్యాన్ని అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకుంది.
చిన్న వయసులోనే జాతీయస్థాయి వేదికపై తన నృత్య ప్రతిభను ప్రదర్శించడం తల్లాడ ప్రాంతానికి గర్వకారణంగా నిలిచింది. జ్ఞానికా రెడ్డి తల్లాడకు చెందిన దగ్గుల సుధాకర్ రెడ్డి, లక్ష్మీ దంపతుల కుమార్తె.
ఈ సందర్భంగా చిన్నారి జ్ఞానికా రెడ్డిని తల్లాడ గ్రామపంచాయతీ మాజీ విడీసీ చైర్మన్ దగ్గుల శ్రీనివాస్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ధూపాటి భద్రరాజు, దగ్గుల నర్సిరెడ్డి, అప్పిరెడ్డి, షేక్ ఈసూబ్, రామకృష్ణ రెడ్డి తదితరులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయి పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

బియ్యం అక్రమ నిల్వలపై సీపీఐ హెచ్చరికలు

ధరలను అదుపు చేయకుంటే గోదాములపై ప్రత్యక్ష దాడులు తప్పవు

రేషన్ షాపుల ద్వారా అన్ని నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు

హనుమకొండలో సీపీఐ భారీ ధర్నా





హనుమకొండ / నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):
నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు విమర్శించారు. ముఖ్యంగా బియ్యం ధరలను తక్షణమే అదుపులోకి తీసుకురావాలని, లేనిపక్షంలో అక్రమ నిల్వదారుల గోదాములపై సీపీఐ ఆధ్వర్యంలో ప్రత్యక్ష దాడులు తప్పవని హెచ్చరించారు.
ధరల నియంత్రణ, ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతం తదితర డిమాండ్లతో బుధవారం హనుమకొండలోని అంబేద్కర్ జంక్షన్‌లో సీపీఐ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.
ప్రభుత్వం తక్షణమే స్పందించి అక్రమ నిల్వదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బియ్యం ధరలను నియంత్రించడంతో పాటు అక్రమంగా నిల్వ చేసిన గోదాములపై విజిలెన్స్ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించాలని కోరారు. రేషన్ దుకాణాల ద్వారా కేవలం బియ్యం మాత్రమే కాకుండా పప్పులు, వంటనూనె, చక్కెర తదితర నిత్యావసర వస్తువులను కూడా సబ్సిడీ ధరలకు పంపిణీ చేయాలని సూచించారు.
ప్రజల ఆకలి బాధలను ప్రభుత్వం పట్టించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు స్పష్టం చేశారు.
ఈ ధర్నాలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, మండల కార్యదర్శి ఎన్. అశోక్ స్టాలిన్, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, నాయకులు అలకుంట్ల యాకయ్య, పొనుగోటి రాముగోపాల్ చారి, పూజారి అమృతయ్య, పొక్కుల సదానందం, కోడెపాక బాబు, మామునూరి దామోదర్, నోముల కిశోర్, మాలోత్ మంగ, కేతపాక ప్రసాద్, తాటికంటి మమత, అలకుంట్ల మల్లయ్య, కనకం కావ్యశ్రీతో పాటు అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేలేరులో ఆసరా పింఛన్లపై పాలాభిషేకం..

పేదల మోములో చిరునవ్వులు! -ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవతో 81 మందికి కొత్త పింఛన్లు

మరో 20 దరఖాస్తులు పరిశీలనలో.. అర్హులందరికీ పింఛన్లు అందిస్తాం: సర్పంచ్ బిల్లా యాదగిరి





వేలేరు / నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):పేదల కష్టాలకు భరోసా.. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల జీవితాలకు ఆసరా కల్పించేలా వేలేరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో 81 నూతన ఆసరా పింఛన్లు మంజూరు కావడంతో గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. పింఛన్ల మంజూరుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే కడియం శ్రీహరికి కృతజ్ఞతలు తెలుపుతూ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బిల్లా యాదగిరి ఆధ్వర్యంలో లబ్ధిదారులు పాలాభిషేకం నిర్వహించారు.
ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ పింఛన్ అనేది పేదలకు కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదని, వారి ఆత్మగౌరవానికి, జీవన భరోసాకు ప్రతీక అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవతో వేలేరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో 81 మందికి నూతన ఆసరా పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇప్పటికే లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశామని, మరో 20 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని వెల్లడించారు.
అర్హులెవరూ అన్యాయానికి గురికావొద్దు!
పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన పేదలకు కూడా న్యాయం జరిగేలా కృషి చేస్తామని సర్పంచ్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో పరిశీలనలో ఉన్న దరఖాస్తులకు కూడా మంజూరు లభించేలా ప్రయత్నిస్తామని భరోసా ఇచ్చారు. పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ నూతన పింఛన్ల మంజూరు చేసిన ప్రభుత్వానికి, సహకరించిన ప్రజాప్రతినిధులకు లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకర్, గ్రామపంచాయతీ కార్యదర్శి విజయ, సర్పంచులు శ్రీనివాస్, రాజు, అరుణ, నాగరాజు, వార్డు సభ్యులు ప్రశాంత్, పర్వీన్, లక్ష్మీనారాయణ, చైతన్య, సురేష్, సునీల్, పెద్ద సంఖ్యలో పింఛన్ లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉత్పత్తులకు చట్టబద్ధమైన మద్దతు ధరలు ప్రకటించాలి

బియ్యం బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి ధరలు తగ్గించాలి -సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి డిమాండ్

హసన్‌పర్తి/నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):



వ్యవసాయ రంగాన్ని పారిశ్రామిక రంగంగా గుర్తించి రైతులు పండించే ఆహార, వాణిజ్య పంటలన్నింటికీ చట్టబద్ధమైన మద్దతు ధరలు నిర్ణయించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు మోతే లింగారెడ్డి డిమాండ్ చేశారు. బియ్యం బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి, మధ్య దళారీ వ్యవస్థను నిర్మూలించాలని, కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచుతున్న వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.
బియ్యం ధరలను తగ్గించాలని, నిత్యావసర వస్తువులను రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ హసన్‌పర్తి మండల సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన కరువు పరిస్థితులను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు బియ్యం కృత్రిమ కొరత సృష్టిస్తూ ధరలను పెంచుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బియ్యం ధరలను నియంత్రించాలని, కృత్రిమ కొరతకు పాల్పడుతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ చేసిన సిఫారసులను అమలు చేసి రైతులకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర కల్పించాలని కోరారు.
ధరల నియంత్రణ, ధరల నిర్ణయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అంశాలైనందున రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్ ప్రకారం రెండు ప్రభుత్వాలు సమన్వయంతో రైతాంగాన్ని ఆదుకోవాలని సూచించారు. నేటి రైతాంగ పరిస్థితి వరి పంట వేస్తే అప్పుల ఊబిలో కూరుకుపోయే విధంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వాతావరణ అసమతుల్యత, వర్షాభావ పరిస్థితులు, సాగునీటి కొరత కారణంగా పంట దిగుబడులు తగ్గుతున్నాయని, మరోవైపు పండించిన పంటలకు సరైన ధర లభించక, మద్దతు ధర, బోనస్ అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితులు రైతుల ఆత్మహత్యలకు దారితీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.
ప్రభుత్వం తక్షణమే కరువు నివారణ చర్యలు చేపట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని, 21 రకాల నిత్యావసర వస్తువులను రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు అందించాలని నాయకులు డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నేదునూరి రాజమౌళి, హసన్‌పర్తి మండల సిపిఐ కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్ రెడ్డి, అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం జిల్లా కార్యదర్శి దుమ్మాటి ప్రవీణ్ కుమార్, షేక్ బాబు, ముజిగ పరశురాములు, నాంపల్లి లక్ష్మయ్య, ముజ్జగ అజయ్, గోపు బుచ్చిరెడ్డి, కొత్తగట్టు శ్యాంసుందర్, కల్వచర్ల వెంకటేశ్వర్లు, ఈశ్వర్ లింగం, తిక్క సూర్యప్రకాష్, లింగాడపు వెంకటయ్య, సూరారం ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి అండగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

రూ.5 లక్షల ఎల్ఓసీ మంజూరు.. బాధిత కుటుంబానికి చెక్కు అందజేసిన దేవోజు సదానందం

నర్సంపేట/నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):



ఆపదలో ఉన్న పేద కుటుంబానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి. అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడి వైద్య చికిత్స కోసం రూ.5 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్ఓసీ మంజూరు చేయించి ఆ కుటుంబానికి భరోసా కల్పించారు.నర్సంపేట పట్టణానికి చెందిన విశ్వకర్మ సామాజిక వర్గానికి చెందిన బెజ్జంకి అచలరాజేష్ దంపతుల కుమారుడు తరుణ్ గత కొద్ది రోజులుగా మెదడులో రక్తం గడ్డకట్టడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్సకు సుమారు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు సూచించడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబం ఆందోళనకు గురైంది.ఈ విషయాన్ని నర్సంపేట పట్టణ విశ్వకర్మ మాజీ అధ్యక్షుడు దేవోజు సదానందం దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే చొరవతో రూ.5 లక్షల ఎల్ఓసీ మంజూరైంది. మంజూరైన ఎల్ఓసీ చెక్కును బుధవారం దేవోజు సదానందం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.ఆపద సమయంలో స్పందించి వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి, సహాయం అందేలా కృషి చేసిన దేవోజు సదానందంకు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

డ్రగ్స్, గంజాయి సంస్కృతికి బీజం వేసింది బీఆర్ఎస్ పాలనే!

పల్లా రాజేశ్వర్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్ నాయకులు

జనగామ / నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ సంస్కృతిని పెంచి పోషించింది గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనేనని కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా విమర్శించారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బుధవారం చేర్యాల పట్టణంలోని కేసీఆర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అక్రమ సంపాదనకు పాల్పడిన కొందరు నాయకులు, కార్యకర్తలు మత్తు పదార్థాల సంస్కృతిని ప్రోత్సహించారని ఆరోపించారు. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి వినియోగం, అక్రమ రవాణాపై వస్తున్న ఆరోపణలకు బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మొదలుకొని గ్రామస్థాయి కార్యకర్తల వరకు డ్రగ్స్, గంజాయి వినియోగంపై వస్తున్న ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. గంజాయి డీలర్లుగా కొందరు చెలామణి అవుతున్నారనే ఆరోపణలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డ్రగ్స్, గంజాయి మాఫియాను అరికట్టేందుకు ఈగల్ బృందాలను ఏర్పాటు చేసి, మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మత్తు పదార్థాలపై ప్రభుత్వం రాజీలేని పోరాటం చేస్తోందని పేర్కొన్నారు.
జనగామ నియోజకవర్గం గతంలో ప్రశాంతమైన రాజకీయ వాతావరణానికి, సామరస్యానికి నిలయంగా ఉండేదని, పల్లా రాజేశ్వర్ రెడ్డి వచ్చిన తర్వాత అనవసర వివాదాలు, వ్యక్తిగత విమర్శలు, చిల్లర రాజకీయాలు పెరిగాయని విమర్శించారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన నాయకులు వ్యక్తిగత విమర్శలకు దిగుతూ రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేయడం సరికాదని హితవు పలికారు.
పల్లా రాజేశ్వర్ రెడ్డి ముందుగా తన పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన పరిణామాలపై ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. తమ పార్టీపై వస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పకుండా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై నిరాధార విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఎమ్మెల్యే స్థాయికి తగిన హుందాతనంతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. బాధ్యతారహిత వ్యాఖ్యలు మానుకోకపోతే ప్రజాక్షేత్రంలో తగిన రాజకీయ గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సహనాన్ని చేతగానితనంగా భావించవద్దని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చలకు తాము స్వాగతిస్తామని, వ్యక్తిగత విమర్శలు, నిరాధార ఆరోపణలను సహించబోమని తెలిపారు. ఈ సమావేశంలో సిద్దిపేట డీసీసీ ఉపాధ్యక్షుడు పూర్మ ఆగంరెడ్డి, అధికార ప్రతినిధి కాటం సంజీవయ్య, చేర్యాల మండల అధ్యక్షుడు మంజె మల్లేశం, పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్, మద్దూరు మండల అధ్యక్షుడు మారెళ్ల భాస్కర్ రెడ్డి, ధూల్మిట్ట మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గౌడ్, డీసీసీ కార్యదర్శి జక్కిరెడ్డి సుదర్శన్ రెడ్డి, కొమురవెల్లి దేవస్థాన మాజీ చైర్మన్ ఆడెపు చంద్రయ్య, కౌన్సిలర్లు పోతుగంటి ప్రసాద్, వెలుగల దుర్గయ్య, నాయకులు భూమని బాలరాజు, చింతల మల్లేశం, మల్లిగారి నర్సింలు, మామిడాల నాగరాజు, ఎండీ జహీరోద్దీన్, పోతురాజు ఖలీం పాషా, నర్ర మహేష్, అవుశర్ల శివ, బచ్చల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ చేయూత పెన్షన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

సిద్ధాపూర్, జయగిరి గ్రామాల్లో నూతన పెన్షన్ పత్రాల పంపిణీ





హసన్‌పర్తి/నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):
వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు హసన్‌పర్తి మండలంలోని సిద్ధాపూర్, జయగిరి గ్రామాల్లో నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్ పత్రాలను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేణుకుంట్ల అశోక్ కుమార్ లబ్ధిదారులకు అందజేశారు. తొలుత సిద్ధాపూర్ గ్రామంలోని ఐకేపీ కేంద్రంలో కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, అనంతరం జయగిరి గ్రామంలో లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో చేయూత పెన్షన్ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. గతంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ పెన్షన్ల కోసం ఎదురుచూసిన అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. పెన్షన్ కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న భరోసా అని అన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల రాకేష్ రెడ్డి, మల్లారెడ్డిపల్లి పీఏసీఎస్ చైర్మన్ కుమారస్వామి, ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, మాజీ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 29న ప్రజా గర్జనను జయప్రదం చేయండి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై హైదరాబాద్‌లో భారీ ప్రదర్శన, బహిరంగ సభ

తల్లాడ/నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 29న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రజా గర్జన ప్రదర్శన, బహిరంగ సభను ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ లాల్మియా పిలుపునిచ్చారు.
బుధవారం సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ తల్లాడఏన్మూరు సంయుక్త మండల కమిటీ సమావేశం డి. రమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన షేక్ లాల్మియా మాట్లాడుతూ దేశంలోని కీలక వనరులు, సంపదలను ఆదానీ, అంబానీ వంటి దేశీయ కార్పొరేట్ సంస్థలతో పాటు విదేశీ కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం కట్టబెడుతోందని విమర్శించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ పేరుతో



దళితులు, మైనార్టీలు, పేదలు, తమకు వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లను తొలగించే చర్యలు చేపడుతున్నారని ఆరోపించారు. 13 కోట్ల 40 లక్షల ఓట్ల తొలగింపునకు సంబంధించిన చర్యలను వెంటనే రద్దు చేయాలని, ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేష్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
జీఎస్టీ పేరుతో ప్రజలపై పన్నుల భారం మోపుతున్నారని, డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచడంతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులకు భారంగా మారాయని అన్నారు. పెరిగిన ధరలను వెంటనే తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరారు.
రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చి, ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలకు భరోసా కల్పించిందని, ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ మినహా మిగతా హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పోడు భూములన్నింటికీ పట్టాలు ఇవ్వాలని, అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకునే చర్యలను నిలిపివేయాలని, అటవీ, రెవెన్యూ అధికారుల అక్రమాలను అరికట్టాలని డిమాండ్ చేశారు.
ఈ సమావేశంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ తల్లాడఏన్మూరు సంయుక్త మండల కార్యదర్శి కొండే వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి డి. శ్రీనివాసరావు, డి. రమణ, జి. పుల్లమ్మ, పటాన్ నాగుల మీరా, వెంకన్న, షేక్ జాన్మియా తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం

మొక్కజొన్న, మిరప రైతులకు తెగుళ్ల నివారణపై కీలక సూచనలు

నర్సంపేట / నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):
నర్సంపేట డివిజన్ పరిధిలోని చెన్నారావుపేట మండలంలో పంటలను ఆశిస్తున్న తెగుళ్లను గుర్తించి, రైతులకు తగిన సూచనలు అందించేందుకు శాస్త్రవేత్తల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించింది. తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, వరంగల్‌తో పాటు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్‌కు చెందిన శాస్త్రవేత్తలు మండలంలోని బోజెరువు, పాపాయిపేట గ్రామాల్లో సాగవుతున్న మొక్కజొన్న, వేరుశనగ, మిరప పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్. శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ యాసంగి మొక్కజొన్న తొలిదశలో కత్తెర పురుగు ఆశించే అవకాశం ఉందని, నివారణకు 1500 పీపీఎం వేపనూనెను లీటరు నీటికి 5 మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పురుగు ఉధృతి అధికంగా ఉన్నట్లయితే క్లోరాంట్రానిలిప్రోల్ గుళికలను ఎకరానికి 4 కిలోల చొప్పున మొక్క మొవ్వులో వేయాలని లేదా సంబంధిత మందును ఎకరానికి 80 మి.లీ. చొప్పున పిచికారీ





చేయాలని తెలిపారు. మిరప పంట ప్రస్తుతం శాఖీయ దశ నుంచి పూత దశకు చేరుకుంటోందని, ఈ దశలో వేరు కుళ్లు తెగులు, ఆకు ముడత ప్రధాన సమస్యలుగా గుర్తించినట్లు వెల్లడించారు. వేరు కుళ్లు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున కలిపి మొక్క మొదలు పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. తెల్లదోమ నివారణకు ఎకరానికి 15 నుంచి 20 పసుపు రంగు జిగురు అట్టలు, తామర పురుగుల నివారణకు 20 నుంచి 30 నీలం రంగు జిగురు అట్టలను పొలంలో ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. రసం పీల్చే పురుగుల నివారణకు ఫిప్రోనిల్ మందును లీటరు నీటికి 2 మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్. శ్రవణ్ కుమార్, డాక్టర్ బి. వెంకట రాజ్ కుమార్, సౌందర్య, మానస, చెన్నారావుపేట మండల వ్యవసాయ అధికారి గోపాల్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి తిరుపతితో పాటు పలువురు అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

నవంబర్ 19న రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో పండుగ వాతావరణంలో ప్రారంభోత్సవాలు నిర్వహించాలి

జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు





మహబూబాబాద్ /నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త): రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని నవంబర్ 19న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సిద్దిపేట జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్న నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ప్రారంభోత్సవాలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పథకం ప్రారంభోత్సవ ఏర్పాట్లు, దరఖాస్తుల సేకరణ, ప్రజలకు అవగాహన కల్పించే అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశానికి మహబూబాబాద్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డులో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి, ప్రతి కుటుంబం నుంచి బీమా పొందే వ్యక్తి, నామినీ వివరాలతో కూడిన దరఖాస్తులను సేకరించాలని ఆదేశించారు. వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అర్హత కలిగిన ఏ కుటుంబం కూడా పథకానికి దూరం కాకుండా చూడాలని స్పష్టం చేశారు. పథకం ప్రయోజనాలు, దరఖాస్తు విధానం, ప్రత్యేక శిబిరాల వివరాలను ముద్రణ, ఎలక్ట్రానిక్, సామాజిక మాధ్యమాలతో పాటు గ్రామాల్లో మైక్ ప్రచారం, పోస్టర్లు, కరపత్రాల ద్వారా విస్తృతంగా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రారంభోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పథకం అమలును నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్లకు ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్య ప్రణాళిక అధికారి వల్లూరి శ్రీనివాసరావు, జిల్లా ప్రజా సంబంధాల అధికారి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేవాదుల కాలువ పనులు వెంటనే పూర్తి చేయాలి

ఆరేళ్లుగా అసంపూర్తిగా ఎల్ఎంసీ డీసీ3 నిర్మాణం.. ఐదు వేల ఎకరాలకు అందని సాగునీరు

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి అఖిలపక్ష కమిటీ వినతిపత్రం

నర్సంపేట/నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):




జె. చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం ప్యాకేజ్5 పరిధిలోని ఎల్ఎంసీ డీసీ3 కాలువ నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని అఖిలపక్ష కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో పాటు దేవాదుల ప్రాజెక్టు నర్సంపేట ఎస్ఈ కార్యాలయంలో డీఈ, ఈఈ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఈర్ల పైడి, బీఆర్ఎస్ నాయకులు చింతపట్ల సురేష్ మాట్లాడుతూ.. నల్లబెల్లి మండలం గొల్లపల్లి గ్రామం నుంచి దబ్బరిపేట, మేడపల్లి, రామారావు తండా, నర్సింగాపురం, ఇటుకలపల్లి, ఆకుల తండా, ఎనగల్ తండా, ముత్తోజిపేట, రాజుపేట మీదుగా దామెర చెరువు వరకు 11.905 కిలోమీటర్ల పొడవున ఈ కాలువ నిర్మాణం చేపట్టారని తెలిపారు. ఈ కాలువ పూర్తయితే సుమారు ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు తాగునీటి అవసరాలు కూడా తీరుతాయని పేర్కొన్నారు.
అయితే సంబంధిత కాంట్రాక్టర్ సుమారు ఆరేళ్ల క్రితమే నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేయడంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ పూర్తికాకపోవడంతో సాగునీరు అందక ఈ సీజన్‌లో పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాలను పట్టించుకోకుండా పనులను అసంపూర్తిగా వదిలేయడం వల్ల వేలాది ఎకరాల ఆయకట్టు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు.
రాబోయే సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం, ఇరిగేషన్ శాఖ అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో పాటు అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి కాలువ నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే వేసవిలోనూ రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ సంఘం నాయకులు లింగదారి శంకర్, నూకలమరి సదానందం, వాడుకార్ చందర్రావు, గొర్రె మొగిలి, బీఆర్ఎస్ నాయకులు భూక్య వీరన్న, పిట్టల శ్రీను, మండల రాజమౌళి, సీపీఎం అనుబంధ రైతు సంఘం నాయకులు గోనె మల్లయ్య, పెండ్యాల సారయ్య, అన్వర్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

కిడ్నీ మార్పిడి చికిత్సకు రూ.4.50 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ మంజూరు

నిరుపేద యువతి వైద్యానికి నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ చొరవ

మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు



జనగామ/చేర్యాల నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త): నిరుపేద కుటుంబానికి చెందిన కిడ్నీ వ్యాధిగ్రస్తురాలి వైద్య చికిత్సకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.4.50 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించడంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ చొరవ చూపారు.
జనగామ నియోజకవర్గం చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన ఈరి రాజలింగం కుమార్తె ఈరి విహిత చిన్న వయసులోనే కిడ్నీ వైఫల్యంతో బాధపడుతోంది. ఆమెకు వైద్య చికిత్స అందించేందుకు ఆర్థిక స్థోమత లేక కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ తక్షణమే స్పందించి, మంత్రి పొన్నం ప్రభాకర్, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.4 లక్షల 50 వేల ఎల్ఓసీ మంజూరు చేయించారు. మంజూరైన ఎల్ఓసీ పత్రాన్ని బుధవారం ముస్త్యాల గ్రామంలోని బాధితురాలి నివాసానికి వెళ్లి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తుల సమక్షంలో కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. బాధిత యువతికి వైద్య సహాయం అందించేందుకు సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేదలకు వైద్యపరమైన ఇబ్బందులు ఎదురైనప్పుడు అండగా నిలవడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన నాగపురి కిరణ్ కుమార్ గౌడ్‌తో పాటు సహకరించిన ప్రజాప్రతినిధులు, నాయకులకు విహిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు బండారు సతీష్, మీసా శ్రీశైలం, భాస్కర్, గుంటి వేణు తదితర గ్రామ కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

వార్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డికి కౌన్సిలర్ జాటోత్ సుజాత హరీష్ నాయక్ వినతి



కేసముద్రం/నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):
కేసముద్రం మున్సిపాలిటీలోని ఒకటో వార్డు అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డికి ఒకటో వార్డు కౌన్సిలర్ జాటోత్ సుజాత హరీష్ నాయక్ వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వార్డులో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. వార్డులో మెరుగైన రహదారుల నిర్మాణం, విద్యుత్ లైన్ల ఏర్పాటు, సైడ్ డ్రైనేజీల నిర్మాణం, పాఠశాల భవన నిర్మాణం వంటి అత్యవసర అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.ఒకటో వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని, అవసరమైన నిధులు మంజూరు చేసి సహకరించాలని రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని కౌన్సిలర్ జాటోత్ సుజాత హరీష్ నాయక్ విజ్ఞప్తి చేశారు.

అలర్ట్.. ఈ నెల 20, 21 తేదీల్లో భారీ వర్షాలు!

అధికారులంతా హెడ్‌క్వార్టర్స్‌లోనే ఉండాలి

జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి.. కలెక్టర్ దివాకర టి.ఎస్.

ఖమ్మం/నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):



ఈ నెల 20, 21 తేదీల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అధికారులందరూ తప్పనిసరిగా హెడ్‌క్వార్టర్స్‌లోనే అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.ఆక్వాన్ తుఫాన్ పూర్తిగా ఖమ్మం జిల్లాలో కేంద్రీకృతమైందన్న సమాచారం ఉన్నప్పటికీ, బుధవారం మధ్యాహ్నం 2 గంటల నాటికి అందిన తాజా సమాచారం ప్రకారం తుఫాన్ ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వైపు దారి మళ్లినట్లు కలెక్టర్ తెలిపారు. దీంతో జిల్లాపై తుఫాన్ ప్రభావం కొంత తగ్గే అవకాశం ఉన్నప్పటికీ భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వివరించారు.ఈ నేపథ్యంలో బుధవారం జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లతో కలెక్టర్ జూమ్ సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డితో కలిసి తుఫాన్ ప్రభావం, ముందస్తు చర్యలు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు.
వర్షాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే తక్షణమే స్పందించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

విషాద ఘటన.. మృత దంపతుల అంత్యక్రియలకు ఏర్పాట్లు



వరంగల్/నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):
వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలోని పెరుకవాడకు చెందిన సంజయ్ కుమార్, ఆయన భార్య శోభ ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ వెంటనే స్పందించారు. సీఎంఓ కార్యాలయం నుంచి సమాచారం అందడంతో ఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద దేవితో మాట్లాడి అంత్యక్రియలకు అవసరమైన ఏర్పాట్లు చేయించారు. కిలా వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్‌తో సమన్వయం చేసుకుని అంత్యక్రియలు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు.

ప్రేమజంటకు రక్షణ కల్పించాలని ఫిర్యాదు



వరంగల్/నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):
ప్రేమ వివాహం చేసుకున్న తమను విడదీసేందుకు తల్లిదండ్రులు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ ఓ ప్రేమజంట పోలీసులను ఆశ్రయించింది. వర్ధన్నపేట మండలం బండవతపురానికి చెందిన మరుపట్ల అభిషేక్, దమ్మన్నపేటకు చెందిన ఎర్ర మౌనిక ప్రేమించి వివాహం చేసుకున్నారు, మౌనిక తల్లిదండ్రులు ఆమెను హైదరాబాద్‌కు తీసుకెళ్లి నిర్బంధించారని ఆరోపణలు ఉన్నాయి. వారి నుంచి తప్పించుకున్న మౌనిక భర్తతో కలిసి బుధవారం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని తమకు రక్షణ కల్పించాలని, తల్లిదండ్రులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసింది.

కర్నూలు ఆసుపత్రి నుంచి రాప్తాడు నిందితుడు హేమంత్ డిశ్చార్జ్..

భారీ బందోబస్తు మధ్య జైలుకు

రాప్తాడు పాఠశాలలో విద్యార్థినిపై దాడి కేసు నిందితుడు హేమంత్ జైలుకు తరలింపు

కర్నూలు జీజీహెచ్‌లో చికిత్స అనంతరం కోలుకోవడంతో వైద్యుల డిశ్చార్జ్

భారీ పోలీసు బందోబస్తు నడుమ అనంతపురం జిల్లా జైలుకు తరలించిన పోలీసులు



కర్నూలునవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):
అనంతపురం జిల్లా రాప్తాడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై దాడి చేసిన కేసులో నిందితుడు హేమంత్‌ను పోలీసులు అనంతపురం జిల్లా జైలుకు తరలించారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో చికిత్స పొందుతున్న అతడి ఆరోగ్యం నిలకడగా ఉండటంతో వైద్యులు డిశ్చార్జ్ చేశారు. దీంతో పోలీసులు అతడిని తమ అదుపులోకి తీసుకుని, భారీ బందోబస్తు మధ్య అనంతపురం జిల్లా జైలుకు తరలించి జ్యుడీషియల్ రిమాండ్‌కు అప్పగించారు.కొన్ని రోజుల క్రితం పాఠశాల తరగతి గదిలోకి చొరబడిన హేమంత్... విద్యార్థినిపై ఎలక్ట్రిక్ రంపంతో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఆమెను కాపాడేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థికి కూడా గాయాలయ్యాయి. అనంతరం నిందితుడిని ఆత్మకూరు అటవీ ప్రాంతంలో పట్టుకునే క్రమంలో పోలీసులపై దాడికి యత్నించగా, ఆత్మరక్షణ కోసం పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన హేమంత్‌కు అనంతపురం ఆసుపత్రిలో ఇన్ఫెక్షన్ కారణంగా కుడి కాలు తొలగించారు. అనంతరం ఊపిరితిత్తుల్లో రక్తం గడ్డకట్టడంతో పరిస్థితి విషమించి, నవంబర్ 13న మెరుగైన చికిత్స కోసం కర్నూలు జీజీహెచ్ కార్డియాలజీ ఐసీయూకు తరలించారు.కర్నూలు ఆసుపత్రిలో ఐదు రోజుల ప్రత్యేక చికిత్స తర్వాత నిందితుడు కోలుకున్నాడు. ఈ సందర్భంగా కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. “నిందితుడి బీపీ, పల్స్ రేటు సాధారణ స్థితికి వచ్చాయని, కాలికి అయిన గాయం కూడా పూర్తిగా మానిందని ఆయన వెల్లడించారు.“ హేమంత్ ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన నివేదికను అనంతపురం న్యాయస్థానానికి సమర్పించనున్నారు. మరోవైపు దాడిలో తీవ్రంగా గాయపడిన విద్యార్థిని ప్రస్తుతం బెంగళూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటోంది. నిందితుడు జైలుకు చేరడంతో పోలీసులు తదుపరి దర్యాప్తును వేగవంతం చేశారు.

టీడీపీ అభ్యర్థి చెవికొరికేసిన వైసీపీ అభ్యర్థి!

అన్నమయ్య జిల్లా తూముకుంటలో నామినేషన్ల వేళ తీవ్ర ఉద్రిక్తత





నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):
అన్నమయ్య జిల్లా గాలివీడు మండలంలో పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. తూముకుంట గ్రామ పంచాయతీ పరిధిలో వార్డు సభ్యుడి నామినేషన్ దాఖలు చేసే విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల మధ్య చెలరేగిన వివాదం హింసాత్మకంగా మారింది.
స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా పలు ప్రాంతాల్లో వైసీపీ, టీడీపీ కూటమి నేతల మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే తూముకుంట గ్రామ పంచాయతీలో టీడీపీ తరఫున వార్డు సభ్యుడిగా పోటీ చేసేందుకు రఘుపతి నాయుడు నామినేషన్ వేసేందుకు వచ్చాడు. ఆ సమయంలో అక్కడకు చేరుకున్న వైసీపీ నాయకుడు రామ్మోహన్ నాయుడు ఆయనతో వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరగడంతో ఆగ్రహానికి గురైన రామ్మోహన్ నాయుడు, రఘుపతి నాయుడిపై దాడి చేసి ఆయన కుడి చెవిని బలంగా కొరికేశాడు. ఈ దాడిలో తీవ్ర రక్తస్రావం కావడంతో బాధితుడిని వెంటనే స్థానికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. రఘుపతి నాయుడికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు అత్యవసర చికిత్స అందించారు. గాయం తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఆయన చెవిలోని కొంత భాగాన్ని తొలగించాల్సి వచ్చింది.ఈ అమానుష ఘటనపై బాధితుడు రఘుపతి నాయుడు పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. రాజకీయ కక్షతో తనపై దాడికి పాల్పడి, తీవ్రంగా గాయపరిచిన రామ్మోహన్ నాయుడిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు డిమాండ్ చేస్తున్నాడు. ఘటనా స్థలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

జగన్ కేసుల్లో ఈడీ దూకుడుకు కారణమిదేనా?

2019 లెక్కలు వేరు.. 2024 తర్వాత పరిస్థితి వేరు



నవంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):
మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఒక్కసారిగా వేగం పెంచింది. పదిహేనేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత, దాల్మియా సిమెంట్స్ వ్యవహారంలో ఇవాళ (నవంబర్ 18) కోర్టులో సవరించిన కొత్త చార్జిషీటును ఈడీ దాఖలు చేసింది. ఈ పరిణామం తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. మాజీ సీఎం జగన్మోహనరెడ్డిపై ఇప్పటివరకు 9 చార్జిషీట్లు దాఖలు కాగా, తాజాగా పదో అస్త్రం సంధించినట్లుగా భావిస్తున్నారు. అంతేకాకుండా మాజీ సీఎం చుట్టూ ఉచ్చు బిగుస్తోందా అన్న చర్చ జోరందుకుంది. తాజా చర్యను కేవలం న్యాయపరమైన ప్రక్రియగానే కాకుండా, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి, జగన్‌కు మధ్య సంబంధాలపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు.

ఇదీ అసలు కథ

దాల్మియా సిమెంట్స్ కేసులో ఈడీ తాజా కదలిక వెనుక బలమైన న్యాయపరమైన కారణాలు ఉన్నాయని న్యాయవాదులు చెబుతున్నారు. సీబీఐ ప్రత్యేక కోర్టు ఈ కేసులను రోజువారీ విచారణకు అనుమతించడంతో, డిశ్చార్జ్ పిటిషన్లపై త్వరగా తేల్చేందుకు దర్యాప్తు సంస్థ సిద్ధమైందని అంటున్నారు. గతంలో ఈ కేసులో మనీలాండరింగ్ కింద ఈడీ రూ. 793.34 కోట్ల ఆస్తులను జప్తు చేసింది. అయితే, ఈ ఏడాది మార్చిలో అప్పిలేట్ ట్రైబ్యునల్ నేరారోపణ మొత్తాన్ని రూ. 92.52 కోట్లకు తగ్గించింది. అదే సమయంలో ఆస్తుల అటాచ్‌మెంట్‌కు బదులు బ్యాంకు గ్యారెంటీ వంటి ప్రత్యామ్నాయ భద్రత కల్పించే వెసులుబాటు ఇచ్చిందని చెబుతున్నారు. ట్రైబ్యునల్ ఆదేశాలకు అనుగుణంగా పాత ప్రాసిక్యూషన్ ఫిర్యాదుకు కీలక సవరణలు చేస్తూ ఈడీ తాజా చార్జిషీటు వేసినట్లుగా భావిస్తున్నారు

ఢిల్లీ సమీకరణాలు మారుతున్నాయా? మాజీ సీఎం జగన్ కేసుల్లో ఈడీ దూకుడు వెనుక రాజకీయ కోణం లేకపోలేదని విశ్లేషకులు భావిస్తున్నారు. 2019 నుంచి 2024 వరకు వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో కేంద్రంతో జగన్ సత్సంబంధాలు నెరిపారనే విమర్శలు ఉండేవి. అప్పట్లో రాజ్యసభలో కీలక బిల్లుల ఆమోదం కోసం బీజేపీకి వైసీపీ మద్దతు అవసరమయ్యేది. కానీ, 2024 ఎన్నికల ఫలితాలు ఆ లెక్కలను తలకిందులు చేశాయి. ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి రావడం, కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వానికి చంద్రబాబు కీలక భాగస్వామిగా మారడంతో ఢిల్లీ ప్రాధాన్యతలు పూర్తిగా మారిపోయాయని విశ్లేషిస్తున్నారు. అసెంబ్లీలో 11 సీట్లకే పరిమితమై, పార్లమెంటులో బలం కోల్పోయిన వైసీపీ అవసరం ఇప్పుడు కేంద్రానికి లేకుండా పోయిందని, ఫలితంగానే జగన్ కేసులపై దృష్టి పెట్టిందనే అభిప్రాయం వినిపిస్తోంది.

ఒత్తిడిలో వైసీపీ అధినేత?

అక్రమాస్తుల కేసు మాత్రమే కాకుండా, గత వైసీపీ హయాంలో జరిగినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న మద్యం స్కాంతోపాటు పలు కేసుల్లో రాష్ట్ర ప్రభుత్వం సీఐడీ అధికారులతో ప్రత్యేక దర్యాప్తులు జరిపిస్తోంది. ఈ కేసులపైనా ఈడీ కన్నేసినట్లు జరుగుతున్న ప్రచారం రాజకీయాలను వేడెక్కిస్తోంది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ విచారణ సంస్థలు, మరోవైపు కేంద్ర దర్యాప్తు సంస్థల వరుస దాడులతో మాజీ సీఎం జగన్ న్యాయపరంగా, రాజకీయంగా తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారని భావిస్తున్నారు. ఈ పరిణామాల ప్రభావంతోనే జగన్ తన రాజకీయ వ్యూహంలో మార్పులు చేసుకుంటున్నట్లు కనిపిస్తోందని అంటున్నారు. ప్రత్యర్థులపై వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉండాలని పార్టీ శ్రేణులకు ఆయన ఇస్తున్న సంకేతాలు కూడా తాజా చిక్కుల తీవ్రతకు అద్దం పడుతున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు.

తుది జట్టు ఎంపిక గిల్‌దే!

సిరాజ్ స్థానంపై ఉత్కంఠ.. బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ స్పష్టత



న్యూజిలాండ్‌తో తొలి టెస్టుకు భారత తుది జట్టు ఎంపికపై ఉత్కంఠ నెలకొంది. తుది జట్టులో ఎవరికి చోటు కల్పించాలన్న నిర్ణయం కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌దేనని భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ స్పష్టం చేశారు. ముఖ్యంగా పేసర్ మహమ్మద్ సిరాజ్ జట్టులో ఉంటాడా లేదా అన్న ప్రశ్నకు ఆయన స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు.సిరాజ్ ప్రపంచస్థాయి బౌలర్ అని, భారత జట్టు తరపున ఎన్నో సందర్భాల్లో తన ప్రతిభను నిరూపించుకున్నాడని మోర్కెల్ ప్రశంసించారు. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌కు భారత బౌలింగ్ విభాగంలో 20 వికెట్లు తీసే సామర్థ్యం ఉందని ఇప్పటికే చెప్పినట్లు వెల్లడించారు. అయితే తుది నిర్ణయం మాత్రం కెప్టెన్ గిల్ తీసుకుంటారని పేర్కొన్నారు. న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో భారత్ నలుగురు పేసర్లతో బరిలోకి దిగనుంది. జస్ప్రీత్ బుమ్రా నేతృత్వంలోని బౌలింగ్ విభాగంలో సిరాజ్, ఆకాశ్‌దీప్, ప్రసిద్ధ్ కృష్ణ, అన్షుల్ కాంబోజ్, గుర్నూర్ బ్రార్ మధ్య పోటీ నెలకొంది. పిచ్ పరిస్థితులు, బౌలర్ల సామర్థ్యం, బ్యాటింగ్ సహకారం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని తుది కూర్పును నిర్ణయించనున్నారు.వెల్లింగ్టన్‌లో నవంబర్ 19 నుంచి తొలి టెస్టు ప్రారంభం కానుంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ అవకాశాలను మెరుగుపరుచుకోవాలంటే ఈ సిరీస్ భారత్‌కు కీలకం కానుంది.

ధోనీకి రుతురాజ్ భావోద్వేగ లేఖ

'మీరు ఎప్పటికీ మా తలా.. మా నాయకుడు' అంటూ ప్రశంసలు



భారత క్రికెట్ దిగ్గజం, చెన్నై సూపర్ కింగ్స్ మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీకి ఆ జట్టు ప్రస్తుత కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ భావోద్వేగ సందేశం అందించాడు. ధోనీతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపాడు. 'మీరు ఎప్పటికీ మా తలా.. మా కెప్టెన్, మా నాయకుడు' అంటూ తన అభిమానాన్ని చాటుకున్నాడు. ధోనీతో కలిసి ఆడిన అనుభవాలు, ఆయన నుంచి నేర్చుకున్న విషయాలను గుర్తుచేసుకుంటూ రాసిన సందేశం అభిమానులను ఆకట్టుకుంటోంది.2019లో తొలిసారి చెన్నై సూపర్ కింగ్స్ జట్టులోకి వచ్చినప్పటి నుంచి ధోనీ తనకు ఎంతో ప్రోత్సాహం అందించారని రుతురాజ్ పేర్కొన్నాడు. జట్టులో యువ ఆటగాడిగా అడుగుపెట్టిన సమయంలో తన ప్రతిభను గుర్తించి అవకాశాలు కల్పించడంలో ధోనీ పాత్ర ఎంతో ఉందని తెలిపాడు. ఒత్తిడితో కూడిన పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలి, ఆటపై ఏకాగ్రత ఎలా నిలబెట్టుకోవాలి, విజయాలు వచ్చినప్పుడు ఎలా ఉండాలి, పరాజయాలను ఎలా స్వీకరించాలి అనే విషయాలను ఆయన నుంచి నేర్చుకున్నానని గుర్తుచేసుకున్నాడు.ధోనీ నాయకత్వంలోని ప్రత్యేకతను రుతురాజ్ తన సందేశంలో ప్రస్తావించాడు. ఎన్నో విజయాలు సాధించినప్పటికీ ఆయనలో అహంకారం కనిపించదని, జట్టులోని ప్రతి ఆటగాడికి సమాన ప్రాధాన్యత ఇస్తారని పేర్కొన్నాడు. యువ ఆటగాళ్లకు స్వేచ్ఛనిస్తూ వారి సామర్థ్యాన్ని బయటకు తీసుకురావడంలో ధోనీకి ప్రత్యేకమైన నైపుణ్యం ఉందని ప్రశంసించాడు. ఆటగాళ్లపై నమ్మకం ఉంచడం, కష్టసమయాల్లో వారికి అండగా నిలవడం ఆయన నాయకత్వంలోని గొప్ప లక్షణాలని వివరించాడు.ధోనీతో కలిసి డ్రెస్సింగ్ రూమ్‌ను పంచుకోవడం, మైదానంలో ఆడటం, ఆయన నుంచి విలువైన సలహాలు పొందడం తన క్రికెట్ జీవితంలో మరిచిపోలేని అనుభవాలని రుతురాజ్ పేర్కొన్నాడు. ముఖ్యంగా తన కెరీర్‌లో ఎదురైన ఒడిదుడుకుల సమయంలో ధోనీ ఇచ్చిన ప్రోత్సాహం ఎంతో ఉపయోగపడిందని తెలిపాడు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించడం ద్వారా మరింత ఆత్మవిశ్వాసంతో ఆడేలా చేశారని గుర్తుచేసుకున్నాడు.**సీఎస్‌కే విజయాల్లో ధోనీ ముద్ర**చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ధోనీ అందించిన సేవలు అపారమైనవి. ఆయన నాయకత్వంలో ఆ జట్టు ఐదుసార్లు ఐపీఎల్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. జట్టు ఎన్నో కష్టాలను ఎదుర్కొన్న సందర్భాల్లోనూ ధోనీ తన నాయకత్వంతో ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని నింపాడు. మైదానంలో ప్రశాంతంగా వ్యవహరిస్తూ కీలక సమయాల్లో సరైన నిర్ణయాలు తీసుకోవడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అందుకే అభిమానులు ఆయనను ప్రేమగా 'తలా' అని పిలుచుకుంటారు.ధోనీ నాయకత్వంలో ఆడిన అనేక మంది యువ ఆటగాళ్లు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఆటగాళ్లలోని ప్రతిభను గుర్తించి సరైన సమయంలో అవకాశాలు ఇవ్వడం ఆయన ప్రత్యేకత. జట్టు విజయం సాధించినప్పుడు ఆటగాళ్లకు క్రెడిట్ ఇవ్వడం, ఓటమి ఎదురైనప్పుడు బాధ్యతను స్వీకరించడం ఆయన నాయకత్వానికి నిదర్శనం. ఈ లక్షణాలే ధోనీని మిగతా నాయకుల నుంచి ప్రత్యేకంగా నిలబెట్టాయి.**వారసుడిగా రుతురాజ్‌పై బాధ్యత**ధోనీ తర్వాత చెన్నై సూపర్ కింగ్స్ నాయకత్వ బాధ్యతలు రుతురాజ్ గైక్వాడ్‌కు దక్కాయి. ధోనీ నిర్మించిన జట్టు సంప్రదాయాన్ని కొనసాగించడం ఆయన ముందున్న ప్రధాన సవాలు. జట్టులోని సీనియర్ ఆటగాళ్ల అనుభవాన్ని ఉపయోగించుకుంటూ యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పించడం ద్వారా చెన్నైని విజయపథంలో నడిపించాల్సిన బాధ్యత ఆయనపై ఉంది. ధోనీ నుంచి నేర్చుకున్న నాయకత్వ లక్షణాలను మైదానంలో అమలు చేయడం ద్వారా తనదైన ముద్ర వేయాలని రుతురాజ్ భావిస్తున్నాడు.ధోనీ ఆటగాడిగా జట్టులో కొనసాగకపోయినా ఆయన అనుభవం, సలహాలు చెన్నై సూపర్ కింగ్స్‌కు ఉపయోగపడతాయని అభిమానులు ఆశిస్తున్నారు.

ఒక ఆటగాడిగా ప్రారంభమైన ఆయన ప్రయాణం నాయకుడిగా, మార్గదర్శిగా జట్టుపై చెరగని ముద్ర వేసింది. ఆటకు వీడ్కోలు పలికినా అభిమానుల హృదయాల్లో ఆయన స్థానం మాత్రం ఎప్పటికీ ప్రత్యేకమే. ధోనీకి రుతురాజ్ అందించిన భావోద్వేగ సందేశం ఇద్దరి మధ్య ఉన్న అనుబంధాన్ని మరోసారి చాటిచెప్పింది. గురువు నుంచి నేర్చుకున్న పాఠాలను గుర్తుచేసుకుంటూ శిష్యుడు కృతజ్ఞతలు తెలపడం అభిమానులను ఆకట్టుకుంటోంది. క్రికెట్‌లో విజయాలు, రికార్డులు మాత్రమే కాదు.. ఆటగాళ్ల మధ్య ఉండే అనుబంధాలు, పరస్పర గౌరవం కూడా చిరస్థాయిగా నిలిచిపోతాయని ఈ సందర్భంగా మరోసారి స్పష్టమైంది.

డిసెంబర్ 16న ఐపీఎల్ వేలం

- గోవాలో ఉదయం 11 గంటలకు మినీ వేలం..

అధికారికంగా ప్రకటించిన బీసీసీఐ



స్పోర్ట్స్ డెస్క్: ఐపీఎల్-2027 మినీ వేలానికి తేదీ, సమయం, వేదికను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఖరారు చేసింది. డిసెంబర్ 16న గోవాలో వేలం నిర్వహించనున్నట్లు ప్రకటించింది. బుధవారం ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. వేలం ఉదయం 11 గంటలకు ప్రారంభం కానుంది. దీంతో గత కొంతకాలంగా కొనసాగుతున్న ఊహాగానాలకు తెరపడింది. ఈ వేలం మూడేళ్ల విరామం తర్వాత తిరిగి భారత్‌లో జరుగుతోంది. గత మూడు వేలాలు దుబాయ్, జెద్దా, అబుదాబిలో నిర్వహించారు. ఈసారి గోవాలోని ఐటీసీ గ్రాండ్ హోటల్ వేదికగా వేలం జరగనుంది. స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌తో పాటు జియోహాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుంది.వేలానికి ముందు పది జట్లు 55 మంది విదేశీ ఆటగాళ్లతో సహా మొత్తం 184 మందిని తమ జట్లలో కొనసాగించాయి. మినీ వేలంలో 66 ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది. వీటిలో 25 స్థానాలు విదేశీ ఆటగాళ్లకు కేటాయించారు.లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ రూ.47.45 కోట్లతో అత్యధిక మిగిలిన నిధులతో వేలంలో పాల్గొననుంది. కోల్‌కతా నైట్‌రైడర్స్ వద్ద రూ.41.65 కోట్లు, సన్‌రైజర్స్ హైదరాబాద్ వద్ద రూ.40.15 కోట్లు మిగిలి ఉన్నాయి.

ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అర్ష్‌దీప్ దూకుడు

- 12 స్థానాలు ఎగబాకి సంయుక్తంగా 19వ ర్యాంక్‌కు చేరిక



స్పోర్ట్స్ డెస్క్: ఐసీసీ తాజాగా ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్ సత్తా చాటాడు. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ ముగిసిన అనంతరం విడుదలైన జాబితాలో బౌలర్ల విభాగంలో 12 స్థానాలు మెరుగుపరుచుకుని సంయుక్తంగా 19వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. అఫ్గానిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.న్యూజిలాండ్ బౌలర్ మ్యాట్ హెన్రీ 15 స్థానాలు ఎగబాకి సంయుక్తంగా 12వ ర్యాంక్‌కు చేరుకోగా, కైల్ జేమీసన్ 45వ స్థానానికి చేరాడు.బ్యాటర్ల విభాగంలో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 806 పాయింట్లతో అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. విరాట్ కోహ్లీ 757 పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇంగ్లండ్ బ్యాటర్ టామ్ బాంటన్ ఆస్ట్రేలియాపై సాధించిన సెంచరీతో 34 స్థానాలు మెరుగుపరుచుకుని కెరీర్‌లోనే అత్యుత్తమంగా 13వ ర్యాంక్‌కు చేరాడు. జో రూట్ తొమ్మిదో స్థానంతో టాప్-10లోకి తిరిగి వచ్చాడు.బెస్టు ర్యాంకింగ్స్‌లో భారత బ్యాటర్ రిషభ్ పంత్ ఏడో స్థానానికి ఎగబాకాడు. జింబాబ్వే బౌలర్ బ్లెస్సింగ్ ముజరబానీ ఐదు స్థానాలు మెరుగుపరుచుకుని సంయుక్తంగా 16వ ర్యాంక్‌కు చేరాడు.

ధోనీని దూషించినా.. జట్టులో కొనసాగించాడు!

● వ్యక్తిగత అహంకారం కంటే జట్టు ప్రయోజనాలకే ప్రాధాన్యం..

ఆకాశ్ చోప్రా ఆసక్తికర వ్యాఖ్యలు



భారత క్రికెట్ దిగ్గజం మహేంద్రసింగ్ ధోనీ నాయకత్వ శైలి ఎంత ప్రత్యేకమైనదో వెల్లడించే ఆసక్తికర సంఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. 2023 ఐపీఎల్ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు చెందిన ఓ ఆటగాడు ధోనీతో దురుసుగా ప్రవర్తించడమే కాకుండా, ఆయనను దూషించాడట. అయినప్పటికీ ధోనీ ఆ ఆటగాడిపై వ్యక్తిగత కోపాన్ని చూపకుండా జట్టులో కొనసాగించాడు. జట్టు ప్రయోజనాల కోసం తన ఆత్మగౌరవాన్ని సైతం పక్కనపెట్టిన ధోనీ నిర్ణయాన్ని మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత ఆకాశ్ చోప్రా తాజాగా వెల్లడించారు. 2023లో చెన్నై సూపర్ కింగ్స్ ఐపీఎల్ టైటిల్ గెలిచిన సమయంలో జరిగిన ఈ ఘటనను ఆకాశ్ చోప్రా తన యూట్యూబ్ ఛానల్‌లో వివరించారు. జట్టులోని ఓ యువ ఆటగాడు ధోనీతో చాలా దారుణంగా ప్రవర్తించాడని, దూషణలకు కూడా దిగాడని తెలిపారు. ఈ వ్యవహారం తీవ్రస్థాయికి చేరడంతో ఆ ఆటగాడిని జట్టు నుంచి పంపించేయాలని కొందరు ధోనీకి సూచించారన్నారు. ఆ ఆటగాడు లేకపోయినా జట్టు విజయవంతంగా ఆడగలదని వారు అభిప్రాయపడ్డారని వెల్లడించారు.**అహంకారం కంటే జట్టు విజయమే ముఖ్యం** అయితే ధోనీ మాత్రం వారి సూచనను అంగీకరించలేదు. ఆకాశ్ చోప్రా వెల్లడించిన వివరాల ప్రకారం.. 'అతను తెలివితక్కువగా ప్రవర్తిస్తున్నాడు. కానీ కెప్టెన్‌ను నేను. నా అహంకారాన్ని మధ్యలోకి తీసుకొస్తే అతడి సామాన్లు సర్దించి ఇంటికి పంపించేయగలను. కానీ అతను నాకు ఉపయోగపడతాడు. చెన్నై విజయానికి సహాయపడతాడు. అందుకే నా ఆత్మగౌరవాన్ని, అహంకారాన్ని పక్కనపెట్టి అతడిని జట్టులో కొనసాగిస్తాను' అని ధోనీ అన్నట్లు చోప్రా వివరించారు.ధోనీ తీసుకున్న ఈ నిర్ణయం అద్భుతమని ఆకాశ్ చోప్రా ప్రశంసించారు. వ్యక్తిగత అవమానాన్ని పక్కనపెట్టి జట్టు విజయాన్ని మాత్రమే లక్ష్యంగా పెట్టుకోవడం గొప్ప నాయకత్వ లక్షణమని పేర్కొన్నారు. ఆ ఆటగాడి పేరును మాత్రం ఆయన వెల్లడించలేదు. ఈ ఘటనలో ఎవరి పేరునూ అధికారికంగా నిర్ధారించలేదు. **ఐదోసారి ఐపీఎల్ విజేతగా చెన్నై** ధోనీ నాయకత్వంలో చెన్నై సూపర్ కింగ్స్ 2023లో ఐదోసారి ఐపీఎల్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఫైనల్లో గుజరాత్ టైటాన్స్‌ను ఓడించి మరోసారి విజేతగా నిలిచింది. అంతకుముందు 2010, 2011, 2018, 2021లోనూ చెన్నై టైటిళ్లు సాధించింది. ఆటగాళ్లను ప్రోత్సహించడం, క్లిష్ట పరిస్థితుల్లో ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకోవడం, జట్టు అవసరాలకు అనుగుణంగా వ్యూహాలు రూపొందించడం ధోనీ నాయకత్వంలోని ప్రత్యేకతలుగా నిలిచాయి.ఒక ఆటగాడు తప్పు చేసినప్పుడు వెంటనే కఠిన నిర్ణయం తీసుకోవడం కంటే, అతడి సామర్థ్యాన్ని గుర్తించి జట్టు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వ్యవహరించడం ధోనీ ప్రత్యేకతను తెలియజేస్తోంది. వ్యక్తిగత ప్రతిష్ఠను పక్కనపెట్టి జట్టు విజయానికి ప్రాధాన్యత ఇవ్వడం వల్లే ఆయనకు క్రికెట్ ప్రపంచంలో ప్రత్యేక గౌరవం లభించింది.**ఆటకు వీడ్కోలు పలికినా.. చెరగని ముద్ర** ధోనీ ఐపీఎల్‌లో 278 మ్యాచ్‌లు ఆడి 5,439 పరుగులు సాధించాడు. వికెట్ కీపర్‌గా, కెప్టెన్‌గా, ఫినిషర్‌గా తనదైన ముద్ర వేశాడు. ఐపీఎల్ అభివృద్ధిలో ధోనీ పాత్ర ఎంతో కీలకమని ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డారు. ధోనీ బ్యాటింగ్‌కు వచ్చిన ప్రతిసారీ ప్రేక్షకుల్లో ఉత్సాహం పెరిగేదని, ఆయన లేని లోటు ఐపీఎల్‌కు తప్పకుండా ఉంటుందని పేర్కొన్నారు. ధోనీ గొప్పతనం కేవలం సాధించిన పరుగులు, గెలిచిన ట్రోఫీల్లోనే లేదని ఈ ఘటన మరోసారి నిరూపిస్తోంది. ఆటగాళ్ల తప్పులను అర్థం చేసుకోవడం, వారి సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడం, వ్యక్తిగత భావోద్వేగాల కంటే జట్టు ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి లక్షణాలే ఆయనను ప్రత్యేకమైన నాయకుడిగా నిలబెట్టాయి. అందుకే ధోనీ ఆటకు దూరమైనా ఆయన నాయకత్వ పాఠాలు మాత్రం భవిష్యత్ తరాల క్రికెటర్లకు మార్గదర్శకంగా నిలవనున్నాయి.

20 ఏళ్ల అవసరాలకు క్రీడా వసతులు

● అంతర్జాతీయ ప్రమాణాలతో

మౌలిక సదుపాయాల అభివృద్ధి: మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్: తెలంగాణలో రాబోయే 20 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 నిర్వహణను రాష్ట్రానికి ఒక మంచి అవకాశంగా అభివర్ణించారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ క్రీడా పోటీల నిర్వహణ కోసం రూ.203.36 కోట్లు కేటాయించారని మంత్రి పేర్కొన్నారు. ఈ నిధులను తాత్కాలిక ఏర్పాట్లకే పరిమితం చేయకుండా భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే శాశ్వత సదుపాయాల కల్పనకు వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. గచ్చిబౌలి, ఎల్బీ స్టేడియాలతో పాటు ఇతర క్రీడా వేదికలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు.ఇన్వెస్ట్ తెలంగాణ ద్వారా క్రీడా రంగంలోకి ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆధునిక శిక్షణ కేంద్రాలు, స్టేడియాలు, క్రీడా పరికరాలు, క్రీడా విజ్ఞాన రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలు కల్పిస్తామన్నారు.గ్రామీణ ప్రాంతాలు, గురుకుల విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రత్యేక శిక్షణ అందిస్తామని చెప్పారు. ప్రముఖ క్రీడాకారుల సూచనలను స్వీకరించి, వారిని క్రీడా వేదికల అభివృద్ధిలో భాగస్వాములను చేస్తామన్నారు.ఖేలో ఇండియా పోటీలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా భవిష్యత్తులో క్రీడా రంగానికి రూ.1,500 కోట్ల నుంచి రూ.2,000 కోట్ల వరకు అదనపు నిధులు సాధించే దిశగా కృషి చేస్తామని మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడించారు.

మా అమ్మ నా సినిమానే ముందు చూస్తుంది: దుల్కర్



మలయాళ స్టార్ నటుడు దుల్కర్ సల్మాన్ నటించిన తాజా తెలుగు చిత్రం 'ఆకాశంలో ఒక తార'. ఈ సినిమా నవంబర్ 20న బాక్సాఫీస్ ముందుకు రాబోతోంది. ఆసక్తికరమైన విషయమేమిటంటే, సరిగ్గా అదే రోజు ఆయన తండ్రి, దిగ్గజ నటుడు మమ్ముట్టి నటించిన తమిళ చిత్రం 'ఓం' కూడా థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో బాక్సాఫీస్ వద్ద తండ్రీకొడుకుల సినిమాల మధ్య ఆసక్తికరమైన పోటీ నెలకొంది. ఈ పోటీపై దుల్కర్ సల్మాన్ సరదాగా స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

దర్శకుడు పవన్ సాధినేని రూపొందించిన 'ఆకాశంలో ఒక తార' చిత్రానికి సంబంధించి చెన్నైలో నిర్వహించిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో దుల్కర్ సల్మాన్ పాల్గొన్నారు. ఒకే రోజున తండ్రీకొడుకుల చిత్రాలు విడుదల కానుండటంతో పోటీ తీవ్రంగా ఉంటుందా? అలాగే ఇంట్లో అమ్మ ఎవరి సినిమాను ముందుగా చూస్తారు? అని విలేకరులు దుల్కర్‌ను ప్రశ్నించారు.

ఈ ప్రశ్నకు దుల్కర్ చిరునవ్వుతో బదులిస్తూ.. తన తల్లి ఎల్లప్పుడూ తన వైపే ఉంటుందని, తన సినిమానే ముందుగా చూస్తుందని చమత్కరించారు. "నేను ఇన్ని సంవత్సరాలుగా నటిస్తున్నాను.. మీ అమ్మ నా సినిమాల గురించి ఎప్పుడూ ఇలా అడగలేదు, అలాగే నా చిత్రాలను ఇంత శ్రద్ధగా ఎప్పుడూ చూడలేదు. నువ్వు ఇండస్ట్రీకి వచ్చాకే నీ సినిమాలన్నింటినీ ఆమె ఎంతో ఆసక్తిగా చూస్తోంది అని మా నాన్న ఎప్పుడూ నాతో అంటుంటారు" అని దుల్కర్ సరదాగా పేర్కొన్నారు.అనంతరం ఈ పరిణామంపై ఆయన వివరిస్తూ.. ఇది తమకు ఒక గొప్ప ఆశీర్వాదం వంటిదని అన్నారు. "మేమిద్దరం మలయాళ నటులం. అయినప్పటికీ నా చిత్రం నేరుగా తెలుగులో వస్తుండగా, మా నాన్న చిత్రం 'ఓం' నేరుగా తమిళంలో విడుదలవుతోంది. ఇద్దరి చిత్రాలు ఒకేసారి రావడం మా ఇద్దరికీ ఎంతో సంతోషకరమైన, గర్వించదగ్గ సందర్భం" అని ఆయన తెలిపారు. ఇక 'ఆకాశంలో ఒక తార' విషయానికి వస్తే, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ చిత్రానికి ఇప్పటికే 'యూ/ఏ') సర్టిఫికెట్ జారీ చేసింది. ఇటీవల విడుదలైన టీజర్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది.

చెక్ బౌన్స్ కేసులో నిర్మాత బండ్ల గణేశ్‌కు ఏడాది జైలు శిక్ష



టాలీవుడ్ ప్రముఖ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్‌కు న్యాయస్థానంలో ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. చెక్ బౌన్స్ కేసులో ఆయనకు ఒంగోలు కోర్టు ఏడాది సాధారణ జైలు శిక్ష విధించింది. శిక్షతో పాటు రూ. 95 లక్షల భారీ జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కీలక తీర్పు వెలువరించారు.

పూర్తి వివరాల్లోకి వెళితే... ఆర్థిక లావాదేవీలకు సంబంధించి జెట్టి వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి బండ్ల గణేశ్ తన నిర్మాణ సంస్థ 'పరమేశ్వర ఆర్ట్ ప్రొడక్షన్స్' పేరిట రూ. 95 లక్షల విలువైన చెక్ ఇచ్చారు. అయితే, బ్యాంక్ ఖాతాలో సరిపడా నిధులు లేకపోవడంతో ఆ చెక్ బౌన్స్ అయింది. నగదు చెల్లింపు విషయంలో న్యాయం జరగకపోవడంతో బాధితుడు ఒంగోలు కోర్టును ఆశ్రయించారు.

ఈ కేసుపై న్యాయస్థానంలో సుదీర్ఘంగా విచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం, నేరం రుజువు కావడంతో కోర్టు బండ్ల గణేశ్‌ను దోషిగా తేల్చింది. ఆయనకు ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు రూ. 95 లక్షల జరిమానా విధించింది. జరిమానా మొత్తంతో పాటు, ఈ కేసు విచారణ నిమిత్తం బాధితుడికి అయిన కోర్టు ఖర్చులను కూడా బండ్ల గణేశే పూర్తిగా భరించాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు.గతంలోనూ పలు చెక్ బౌన్స్ కేసుల్లో బండ్ల గణేశ్‌కు న్యాయస్థానాలు జైలు శిక్షలు విధించగా, ఆయన పైకోర్టుల్లో అప్పీల్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే.

తమిళంలోకి ఆనంద్ దేవరకొండ సినిమా



టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ తమ్ముడు, యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన తెలుగులో నటించిన క్రైమ్ కామెడీ చిత్రం 'గం గం గణేశా' ఇప్పుడు తమిళ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాను తమిళంలో 'జై జై గణేశా' పేరుతో అనువదించి విడుదల చేస్తున్నారు. జేజే మూవీస్ పతాకంపై నిర్మాత విజయ్ మాధవన్ ఈ చిత్రాన్ని తమిళంలో రిలీజ్ చేస్తున్నారు. పూర్తిస్థాయి యాక్షన్, థ్రిల్లర్, కామెడీ అంశాలతో వినోదాత్మక చిత్రంగా దీనిని రూపొందించారు. ఈ సినిమాలో ఆనంద్ దేవరకొండ సరసన నయన్ సారిక, ప్రగతి శ్రీవాస్తవ హీరోయిన్లుగా నటించారు. ప్రతినాయకుడి పాత్రలో రాజ్ అరుణ్ నటించగా, దర్శకుడు ఉదయ్ బొమ్మిశెట్టి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. వెన్నెల కిశోర్, సత్యం రాజేష్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.

తెలుగులో ఒక చిన్నపాటి దొంగ పాత్రలో ఆనంద్ దేవరకొండ నటన, వినోదం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. విభిన్న కథలతో తెలుగులో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న ఆనంద్ దేవరకొండ, ఇప్పుడు 'జై జై గణేశా' ద్వారా కోలీవుడ్ ఆడియన్స్‌ను అలరించేందుకు సిద్ధమయ్యారు.

గోదారి గట్టు, మీసాల పిల్లను మించి మరోటి..!



2027 సంక్రాంతి పండుగ కొన్ని నెలలు ఉండగానే తెలుగు సినీ ప్రేమికులు ఎంతో ఆసక్తిగా సంక్రాంతికి విడుదల కాబోతున్న సినిమాల కోసం ఎదురు చూస్తున్నారు. సంక్రాంతి అనగానే తెలుగు సినిమా ఇండస్ట్రీలో అనిల్ రావిపూడి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయన బ్యాక్ టు బ్యాక్ సంక్రాంతికి వస్తున్నాం, మన శంకర వరప్రసాద్ గారు సినిమాలతో వచ్చాడు. ఆ రెండు సినిమాలు ఏ రేంజ్ విజయాన్ని సొంతం చేసుకున్నాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పాన్ ఇండియా రేంజ్‌లో విడుదల కాకుండానే కేవలం తెలుగు వర్షన్‌తో ఏకంగా రూ.300 కోట్లు అంతకు మించి వసూళ్లు చేసిన సినిమాలుగా రికార్డ్ సృష్టించాయి. రాజమౌళి సినిమాలకు సైతం సాధ్యం కాని రికార్డ్‌లను అనిల్ రావిపూడి తన సంక్రాంతి సినిమాలతో సొంతం చేసుకున్నాడు. అందుకే ఆయన నుంచి 2027 సంక్రాంతికి రాబోతున్న 'జనవరి 12 విడుదల' సినిమా పై అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. సంక్రాంతికి జనవరి 12 విడుదల సినిమా... వెంకటేష్, కళ్యాణ్ రామ్‌లు హీరోలుగా నటిస్తూ ఉండగా కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిన్స్‌గా కనిపించబోతున్నారు. వెంకటేష్‌కి జోడీగా కీర్తి సురేష్ నటిస్తూ ఉండగా, కళ్యాణ్ రామ్‌కు జోడీగా కృతి శెట్టి కనిపించబోతుంది. వెంకటేష్, కళ్యాణ్ రామ్‌లు బావ బామ్మర్ధి కావడంతో వినోదం పీక్స్‌లో ఉంటుందని తెలుస్తోంది. కళ్యాణ్ రామ్‌కి అక్కగా లేదా చెల్లిగా కీర్తి సురేష్ కనిపించబోతుంది. వీరిద్దరి కాంబో సీన్స్ ఫుల్ టు కామెడీ అన్నట్లుగా ఉండబోతున్నట్లు యూనిట్ సభ్యులు చెబుతున్నారు. అంతే కాకుండా వెంకటేష్, కీర్తి సురేష్ కాంబోలో వచ్చే సీన్స్ సైతం గతంలో వచ్చిన ఎఫ్ 2 సినిమాను గుర్తు చేస్తాయని అంటున్నారు. మొత్తానికి సినిమాపై అంచనాలు పెరుగుతూనే ఉన్నాయి. దాంతో సినిమా నుంచి ఎప్పుడు ప్రమోషనల్ స్టఫ్ విడుదల అవుతుందా, పాటలు ఎప్పుడు వస్తాయా అని అభిమానులతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేష్, కళ్యాణ్ రామ్... అనిల్ రావిపూడి గత సంక్రాంతి సినిమాలు అయిన సంక్రాంతికి వస్తున్నాం నుంచి మొదటి పాటను డిసెంబర్ నెలలో విడుదల చేయగా, మన శంకరవర ప్రసాద్ గారు సినిమా మొదటి పాటను మూడు నెలల ముందుగానే అంటే అక్టోబర్‌లోనే విడుదల చేయడం జరిగింది. ఆ రెండు పాటల వల్ల సినిమాల యొక్క మార్కెట్ డబుల్ అయింది, ప్రేక్షకుల్లో అంచనాలు రెండు మూడు రెట్లు పెరిగాయి అనడంలో సందేహం లేదు. అందుకే అనిల్ రావిపూడి 'జనవరి 12 విడుదల' సినిమా మొదటి పాట విషయంలోనూ చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. డిసెంబర్ మొదటి వారంలో జనవరి 12 విడుదల సినిమా నుంచి మొదటి పాట విడుదలకు రెడీ అవుతోంది. ఇప్పటికే సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ రెడీ చేసినట్లు తెలుస్తోంది. ఆ పాటకు సంబంధించిన అనౌన్స్‌మెంట్ వీడియోను చిన్న కామెడీ స్కిట్‌గా రెడీ చేశారని కూడా యూనిట్ సభ్యుల నుంచి సమాచారం అందుతోంది.

ఆ మూవీ సెట్లో టార్చర్ చూపించారు.. - పూజిత పొన్నాడ!



ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నంకు చెందిన పూజిత పొన్నాడ ఇంజనీరింగ్ పూర్తి చేసి టాటా కన్సల్టెన్సీ లో ఉద్యోగం చేస్తున్న సమయంలోనే.. తనకంటూ ఒక ఐడెంటిటీ క్రియేట్ చేసుకోవడానికి సినిమా రంగంలోకి అడుగు పెట్టింది. అలా తొలిసారి 2015లో 'ఉప్మా తినేసింది' అనే షార్ట్ ఫిల్మ్ తో కెరియర్ మొదలుపెట్టిన ఈమె.. 2016లో ఊపిరి చిత్రంలో గ్యాలరీ మేనేజర్ గా నటించి.. ఆ తర్వాత రంగస్థలం సినిమాలో ఆది పినిశెట్టి ప్రియురాలిగా పద్మ క్యారెక్టర్ తో ప్రేక్షకులను అలరించింది పూజిత. తర్వాత రాజుగాడు, బ్రాండ్ బాబు, హ్యాపీ వెడ్డింగ్, 7 , కల్కి వంటి చిత్రాలలో కీలక పాత్రలు పోషించిన పూజిత.. తొలిసారి హీరోయిన్ గా నటించిన చిత్రం వేర్ ఈజ్ ది వెంకటలక్ష్మి.. అదే నేను చేసిన తప్పు కూడా.అయితే ఈ సినిమా షూటింగ్ సమయంలో తనకు టార్చర్ అంటే ఏంటో చూపించారు అంటూ దాదాపు ఏడేళ్ల తర్వాత తాను అనుభవించిన ఇబ్బందులను బయటపెట్టి అందరిని ఆశ్చర్యపరిచింది పూజిత పొన్నాడ.

గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమా హారర్ డ్రామాగా రూపొందుతోంది. ఇందులో సస్పెన్స్, ఎమోషన్స్ కీలకంగా ఉండనున్నాయి. పైగా కమిటీ కుర్రోళ్ళు సేమ్ ఈశ్వర్ రాచిరాజు ఇందులో హీరోగా నటిస్తున్నారు. నందు, లిఖిత తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.నన్ను నేను ప్రూవ్ చేసుకోవడానికి మంచి ప్లాట్ఫారం దొరికింది అనుకున్నాను. కానీ ఆ సినిమా షూటింగ్ సెట్లోకి అడుగుపెట్టాక తొలిసారి నా జీవితంలో వరస్ట్ సిచువేషన్ ని ఫేస్ చేశాను. ముఖ్యంగా ఈ విషయాన్ని నేను ఎప్పుడూ ఎక్కడ ఎవరితోనో చెప్పుకోలేదు. ఈ సినిమా షూటింగ్ సమయంలో నన్ను టార్చర్ చేశారు. బలవంతంగా నటించమని ఇబ్బంది పెట్టారు. నిజానికి నేను చాలా స్ట్రైట్ ఫార్వర్డ్ గా ఉంటాను. కానీ ఈ సినిమా సమయంలో నేను చాలా ఇబ్బంది పడ్డానుముఖ్యంగా నేను ఇండస్ట్రీలోకి అప్పుడే కొత్తగా వచ్చాను. ఇండస్ట్రీ గురించి ఏమీ తెలియదు. పైగా ఎవరు తెలియదు. నిజానికి నేను రంగస్థలం, మైత్రి మేకర్స్ వంటి మంచి టీమ్లతో పనిచేశాను. అందులో సుకుమార్ , రామ్ చరణ్ లతో పని చేయడం చాలా అద్భుతంగా అనిపించింది. నేను రంగస్థలం సినిమా కోసం ఏడు రోజులు మాత్రమే పని చేశాను. ఆ సినిమా షూటింగ్ కూడా రాత్రివేళలో జరిగింది.